

'పుష్ప'లకు కొత్త మార్గం

- ములకలచెరువు మీదుగా బెంగళూరుకు...
- పోలీసులకు పట్టుబడడంతో కొత్తమార్గం వెలుగులోకి
- గతంలో కూడా ములకలచెరువు మీదుగా చెన్నైకి...



ములకలచెరువు మండలం సంద్రడివి బి.కొత్తకోట మీదుగా బెంగళూరుకు వెళ్లే రోడ్డు



పెద్దతిప్పసముద్రం మండలం కందుకూరు సమీపంలో ఆంధ్రా-కర్ణాటక సరిహద్దులో మూతపడ్డ చెక్‌పోస్టు

ములకలచెరువు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం స్మగ్లర్లు కొత్త మార్గాన్ని ఎంచుకున్నారు. సుండుపల్లె నుంచి పెద్దమండ్యం, తంబళ్లపల్లె, ములకలచెరువు మండలం సంద్రడివి రోడ్డు, పెద్దతిప్పసముద్రం మండలం కందుకూరు, మల్లెల క్రాస్ మీదుగా బెంగళూరుకు ఎర్రచందనం దుంగలు అక్రమంగా తరలిస్తున్నారు. ఈ మార్గం మారుమూల ప్రాంతాల్లో ఉండడంతో అక్రమ రవాణాకు అనువుగా ఉంటుందని స్మగ్లర్లు ఈ మార్గాన్ని ఎంచుకున్నట్లు తెలుస్తోంది. అలాగే ఆంధ్ర-కర్ణాటక రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న బి.కొత్తకోట మండలం తానావంద్రిమిట్ట, బడికాయలపల్లె, పెద్దతిప్పసముద్రం మండలం కందుకూరు వద్ద ఉన్న మారుగానిపల్లె, చెంద్రాయనిపల్లె క్రాస్, అంకాలమడుగు, మల్లెల క్రాస్ చెక్‌పోస్టులను వైసీపీ ప్రభుత్వం ఎత్తేసింది. దీంతో ఈ మార్గాల్లో తనిఖీలు పూర్తిగా నిలిచిపోయాయి. బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం మండలాలు కర్ణాటక రాష్ట్ర సరిహద్దులో ఉన్నాయి. ఇదే అనువుగా చేసుకున్న ఎర్రచందనం స్మగ్లర్లు కొత్త మార్గాన్ని ఎన్నుకున్నారు. తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసులకు ఇటీవల తంబళ్లపల్లె మండలం అన్నగారిపల్లె సమీపంలో ఎర్రచందనం దుంగలతో పట్టుబడ్డ నిందితులు ములకలచెరువు, పెద్దమండ్యం వాసులు కావడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. సుండుపల్లె మండలంలోని అటవీ ప్రాంతం నుంచి స్మగ్లర్లు రాయచోటి, పీలేరు, చిత్తూరు మీదుగా లేకుంటే పీలేరు, భాకరాపేట, తిరుపతి మీదుగా చెన్నైకు ఎర్రచందనం అక్రమంగా రవాణా అవుతుంటుంది. ఈ ప్రాంతాల్లో పోలీసుల నిఘా అధికంగా ఉండడంతో పాటు చెక్‌పోస్టులు ఉన్నాయి. ఈ మార్గాల్లో టాస్క్‌ఫోర్స్ పోలీసుల నిఘా కూడా ఎక్కువగా ఉండటంతో అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడుతోంది. అయితే స్మగ్లర్లు కొత్తగా ఎంచుకున్న సుండుపల్లె, పెద్దమండ్యం, తంబళ్లపల్లె, ములకలచెరువు, బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం మండలాల మార్గాల్లో మాత్రం తనిఖీలు, చెక్‌పోస్టులు లేకపోవడంతో బెంళూరుకు అక్రమంగా ఎర్రచందనం రవాణా చేస్తున్నట్లు తెలుస్తోంది.

గతంలో ములకలచెరువు మీదుగా చెన్నైకి రవాణా

గతంలో ములకలచెరువు మీదుగా చెన్నైకు ఎర్రచందనం అక్రమ రవాణా జరిగింది. ఆరేళ్లకు ముందు కడప, సుండుపల్లె, శ్రీసత్యసాయి జిల్లా కదిరి, ములకలచెరువు మీదుగా ఎర్రచందనం అక్రమంగా రవాణా అయ్యేది. అప్పట్లో ములకలచెరువు పోలీసుస్టేషన్‌లో ఎర్రచందనం కేసులు కూడా నమోదయ్యాయి. పోలీసులు భారీ స్థాయిలో ఎర్రచందనం దుంగలు కూడా పట్టుకున్నారు. క్రమంగా ఈ మార్గంలో ఎర్రచందనం అక్రమ రవాణా నిలిచిపోయింది. తాజాగా ములకలచెరువు, బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం మండలాల మీదుగా మళ్లీ ఎర్రచందనం అక్రమ రవాణా అవుతున్నట్లు వెల్లడి కావడంతో ఈ ప్రాంతాల్లో అజజడి నెలకొంది.



తంబళ్లపల్లెకు గంజాయి, ఎర్రచందనం మరకలు

తంబళ్లపల్లె నియోజకవర్గానికి గంజాయి, ఎర్రచందనం అక్రమ రవాణా మరకలు అంటాయి. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో 2024 ఫిబ్రవరి నెలలో ములకలచెరువు-పెద్దతిప్పసముద్రం మండలాల సరిహద్దులోని సంద్రడివి రిజర్వు ఫారెస్టు వద్ద బెంగళూరుకు అక్రమంగా గంజాయి రవాణా చేస్తూ రెండు కార్లు, ఆరుగురు నిందితులు పట్టుబడ్డారు. వంద కేజీల గంజాయి దొరకడం సంచలనంగా మారింది. అలాగే ప్రస్తుతం ములకలచెరువు మండలం వేపూరికోట ఫారెస్టు బీటులోని తంబళ్లపల్లె మండలం అన్నగారిపల్లె సమీపంలో ఉన్న వంకగట్టున తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసులు 48 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ములకలచెరువు మండలానికి చెందిన ఇద్దరిని, పెద్దతిప్పసముద్రం మండలానికి చెందిన ఓ వ్యక్తితో పాటు మరొకరిని అరెస్టు చేశారు. ఈ అరెస్టుతో పలు విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. పట్టుబడ్డ నిందితులు గతంలో కూడా ఎర్రచందనం అక్రమంగా రవాణా చేసినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసుల విచారణలో బయటపడినట్లు తెలిసింది.

వేపపిండి మాటున ఎర్రచందనం

తంబళ్లపల్లె మండలం అన్నగారిపల్లె వద్ద పట్టుబడ్డ నిందితులు ఎర్రచందనం దుంగలను వేపపిండి మాటున ఇక్కడికి తెచ్చుకున్నట్లు తెలుస్తోంది. ఓ వాహనంలో కింద ఎర్రచందనం దుంగలను పెట్టి దానిపై వేపపిండి మూటలు వేసి తెచ్చి డంపింగ్ చేసినట్లు సమాచారం. అలాగే బెంగళూరుకు దుంగలను తరలించేందుకు గొడవ వచ్చిందని... బెంగళూరులో సరుకు కొనే వారిని పోలీసులు పట్టుకోవడంతో విషయం పోలీసుల దాకా వెళ్లడంతో నిందితులు పట్టుబడ్డారని రకరకాల వదంతులు విన్పిస్తున్నాయి.

మదనపల్లె రేంజ్ పరిధిలోని మార్గాల్లో ప్రత్యేక నిఘా



తంబళ్లపల్లె మండలం అన్నగారిపల్లె వద్ద ఎర్రచందనం దుంగలు పట్టుబడడంతో మదనపల్లె ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని అన్ని మార్గాల్లో ప్రత్యేక నిఘా ఉంచాం. రాత్రి వేళల్లో పెట్రోలింగ్ చేస్తున్నాం. ఏదైనా సమాచారం ఉంటే మాకు తెలియజేయాలి. సమాచారం ఇచ్చిన వ్యక్తుల పేర్లు గోప్యంగా ఉంచుతాం. ఎర్రచందనం పట్టుబడ్డ అన్నగారిపల్లెతో పాటు చుట్టుపక్కల ఉన్న అటవీ ప్రాంతాల్లో తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి క్షుణ్ణంగా తనిఖీ చేపట్టాం.

- జయప్రసాదరావు, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, మదనపల్లె

మామిడిపండ్లను ఆవులకు వేయొద్దు



శస్త్ర చికిత్స చేసి మామిడి టెంకలను తీస్తున్న డాక్టర్ భాస్కర్

చిన్నమండెం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మామిడిపండ్లను పాడి రైతులు ఆవులకు తినడానికి వేయొద్దని పశువైద్యుడు భాస్కర్ తెలిపారు. వండాడి గ్రామ పంచాయతీలోని కదిరివాండ్లపల్లెలో వెంకట్రామిరెడ్డి అనే రైతుకు చెందిన ఆవు మామిడిపండ్లు తిని అనారోగ్యానికి గురైంది. వైద్యం చేసినా ఉపయోగం లేకపోవడం వలన డాక్టర్ భాస్కర్ ఆవుకు శస్త్ర చికిత్స చేసి 10కిపైగా మామిడి టెంకలు బయటకు తీశారు. దీంతో ఆవు కూడా ఆరోగ్యంగా ఉందని ఆయన తెలిపారు. పాడి రైతులు పశువులకు ఎక్కువ మొత్తంలో మామిడి ఎండ్లు పెట్టవద్దని తెలిపారు.

నర్సరీ నిర్వహణకు లైసెన్స్ తప్పనిసరి



నర్సరీని తనిఖీ చేస్తున్న ఉద్యాన శాఖాధికారి సురేశ్‌బాబు

చిన్నమండెం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): నర్సరీ నిర్వాహకులు లైసెన్సులు తప్పకుండా పొందాలని రాయచోటి ఉద్యానవనశాఖ అధికారి జి.సురేశ్‌బాబు తెలిపారు. గురువారం చిన్నమండెం మండలంలోని దేవగుడిపల్లి, బెస్తపల్లి, కేశాపురంలో కూరగాయల నర్సరీలను తనిఖీ చేశా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీల యజమానులు అంద రూ నాణ్యమైన, అధిక దిగుబడినిచ్చే కూరగాయల నారును ఉత్పత్తి చేసి విక్రయించాలన్నారు. నారు కొన్న ప్రతి రైతుకు తప్పకుండా రశీదు ఇవ్వాలని తెలి పారు. నర్సరీ చట్టం ప్రకారం రిజిస్ట్రేషన్ చేయించుకుని తప్పనిసరిగా లైసెన్స్ పొందాలని, ఇందుకు దరఖాస్తు ఫారంతో పాటు 1000 రూపాయలు చలానా చెల్లించి సంబంధిత ధ్రువపత్రాలను ఉద్యానశాఖ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. అలాగే నర్సరీ లైసెన్స్ గడువు ముగిసిన వారు తిరిగి లైసెన్స్‌ను పునరుద్ధరించుకోవాలని చెప్పారు. కార్యక్రమం లో దేవగుడిపల్లి, కేశాపురం రైతు సేవా కేంద్రం సిబ్బంది కుమారి, మహర్షి పాల్గొన్నారు.

న్యాయం చేయండి

- భర్త ఇంటి ముందు భార్య బైఠాయింపు



భర్త ఇంటిముందు బైఠాయించిన శారద

నందలూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : తన భర్తతో తనను కలిపి న్యాయం చేయాలంటూ ఓ మహిళ భర్త ఇంటి ముందు తండ్రితో కలిసి బైఠాయించిన సంఘటన గురువారం నందలూరులో జరిగింది. బాధితురాలి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని అరవపల్లెకు చెందిన హనుమంతు మురళి, శ్రీలక్ష్మిల కుమారుడు దేవేంద్రప్రసాద్‌కు వేంపల్లెకు చెందిన యనమల వెంకటనారాయణ, లక్ష్మీదేవిల కుమార్తె శారదతో 2014లో వివాహమైంది. నాలుగు సంవత్సరాల పాటు సంసారం సజావుగా సాగింది. 2018లో అత్తాకోడళ్ల మధ్య మనస్పర్థలు రావడంతో తన పుట్టింటికి శారద వెళ్లిపోయింది. దీంతో ఆమె భర్త ప్రసాద్ తన భార్య ఆరోగ్యం సరిగా లేదంటూ కోర్టును ఆశ్రయించి 2021లో విడాకులు తీసుకున్నారు. దీంతో శారద భర్తపై ఫిర్యాదు చేసి రాజంపేట కోర్టును ఆశ్రయించడంతో గత ఏడాది జూలైలో విడాకులను రద్దు చేసింది. అప్పటి నుంచి తన భర్తను కలవాలని ప్రయత్నిస్తుంటే తనను అత్తగారింటికి రానివ్వలేదని కన్నీటిపర్యంతమైంది. తిరిగి తాము గురువారం పోలీసులను ఆశ్రయించడంతో పోలీసులు తన భర్తకు ఫోన్ చేసిన వెంటనే సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకుని ఇంటికి తాళాలు వేసుకుని పరారయ్యాడని తెలిపింది. పెద్దలు, పోలీసులు కలిసి తన భర్తతో కలిపి తన సంసారాన్ని నిలబెట్టాలని వేడుకుంది.

వైసీపీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అరెస్టు

- మాజీ ఎమ్మెల్యేలు శ్రీకాంత్‌రెడ్డి, రమేశ్‌రెడ్డిలపైనా కేసు



ఎంపీపీ సుదర్శన్‌రెడ్డిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

లక్కిరెడ్డిపల్లె, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): బాణాసంచా కాల్చిన ఘటనలో ఓ వ్యక్తి కంటిచూపు పోవడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు వైసీపీకి చెందిన ఎంపీపీ సుదర్శన్‌రెడ్డిని గురువారం పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటనలో మొత్తం 19 మందిపై కేసు నమోదు కాగా మిగిలిన వారికోసం పోలీసులు గాలిస్తున్నారు. పోలీసుల కథనం మేరకు.. గత ఏడాది జరిగిన ఎన్నికల సందర్భంగా ఏప్రిల్‌లో లక్కిరెడ్డిపల్లె మండలంలోని కుర్నూతల, పందిళ్లపల్లె గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యేలు శ్రీకాంత్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, మరికొంత మంది వైసీపీ కార్యకర్తలు, నాయకులు ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా టపాసులు పేల్చడంతో ముండ్ల లోకేశ్ అనే వ్యక్తి కంట్లో పడి అతడి కంటిచూపు పోయింది. ఏడాది దాటినా తనను ఎవరూ పట్టించుకోకపోవడంతో న్యాయం చేయాలని జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు బాధితుడు ఫిర్యాదు చేశాడు. దీనిపై విచారణ చేయాలంటూ ఆదేశాలు వచ్చాయని సీఐ వరప్రసాద్, ఎస్‌ఐ రవీంద్రబాబు తెలిపారు. దీంతో ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు మాజీ ఎమ్మెల్యేలు శ్రీకాంత్‌రెడ్డి, రమేశ్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి, మలే రెడ్డెయ్య, లోమడ జగన్‌మోహన్‌రెడ్డి, ఆవులకుంట వెంకట్రమణ, దుద్దినకుంట విజయభాస్కర్‌రెడ్డి, అరవ శివారెడ్డి, దియాల సుబ్బయ్య, పోలి సుబ్బారెడ్డి, కుడుమల కొండారెడ్డి, వాయల్పాటి వెంకట్రమణతో పాటు మరికొంతమందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

టీబీ ముక్త్ భారత్ అభియాన్‌ను విజయవంతం చేద్దాం

- అడిషనల్ డీఎంహెచ్‌వో రమేష్‌బాబు



ఉద్యోగులతో సమీక్ష నిర్వహిస్తున్న జిల్లా అడిషనల్ డీఎంహెచ్‌వో రమేష్‌బాబు

మదనపల్లె అర్బన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ రమేశ్‌బాబు అన్నారు. గురువారం మదనపల్లెలో క్షయ నివారణ ఉద్యోగులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో టీబీ, లెప్రసి, ఎయిడ్స్ నివారణకు కృషి చేస్తామని, జిల్లాలోని అన్ని ఇండికేటర్లలో నిర్దేశించిన లక్ష్యాలను వంద శాతం సాధిస్తామని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన టీబీ ముక్త్ భారత్ అభియాన్, టీబీ ఇంటెన్సిఫైడ్ కార్యక్రమం జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో నిర్వహిస్తునట్లు చెప్పారు. కార్యక్రమంలో భాగంగా పట్టణం, గ్రామాల్లో టీబీ కేసులను వేగవంతంగా గుర్తించడం, మరణాలను తగ్గించడం, కొత్త కేసులను గుర్తించడం వంటి అంశాలే ప్రధానం లక్ష్యమని తెలిపారు. టీబీ చాంపియన్స్ సహకారంతో న్యూట్రిషన్ కిట్స్ ఇస్తామని చెప్పారు. కార్యక్రమంలో మదనపల్లె టీబీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్, క్షయ నివారణ ఉద్యోగులు ప్రభాకర్, శాంతి, వనజకుమారి, సుశీల, తరుణ్, సూపర్‌వైజర్లు విజయకుమారి, రెడ్డెమ్మ, ఏఆర్‌టీ సిబ్బంది పురుషోత్తం, భరత్ పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రారుపై అవినీతి ఆరోపణలు

- డాక్యుమెంట్ రైటర్లతో వివాదం



సబ్ రిజిస్ట్రారు అక్రమాలను ఏకరువు పెడుతున్న డాక్యుమెంట్ రైటర్లు

కలికిరి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): కలికిరి సబ్ రిజిస్ట్రారు కార్యాలయం అవినీతి నిలయంగా మారిందని, తప్పుడు రిజిస్ట్రేషన్లతో ప్రజలను దోపిడీ చేస్తున్నారని పలువురు రైతులు, డాక్యుమెంట్ రైటర్లు ఆరోపించారు. సబ్ రిజిస్ట్రార్‌పై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో దీనిపైన కార్యాలయంలో గురువారం వివాదం తీవ్ర స్థాయికి చేరింది. కొంతకాలంగా అక్రమ రిజిస్ట్రేషన్లకు కార్యాలయం ఆలవాలంగా మారిందనే విమర్శలు వస్తున్నాయి. సబ్ రిజిస్ట్రారు పార్థసారథి కూడా రైతుల పట్ల దురుసుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు కూడా తరచూ వివాదాలకు దారి తీస్తున్నాయనే విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో స్థానిక రైతులు, డాక్యుమెంట్ రైటర్లు సోమవారం కలెక్టరుతో పాటు రాయచోటి స్టాంపులు రిజిస్ట్రేషన్ల డీఆర్, కడప డీఐజీలకు నేరుగా వినతిపత్రాలు అందజేశారు. దీనిపైన గురువారం సబ్ రిజిస్ట్రారు నుంచి మీడియా ప్రతినిధులు వివరణ తీసుకుంటుండగా ఫిర్యాదుదారులు కూడా వచ్చి ఆయన ఇస్తున్న వివరణలన్నీ తప్పని చెప్పారు. డాక్యుమెంటు రైటర్ల మధ్య వివక్ష చూపిస్తూ వర్గాలు తయారు చేసిన విషయం వాస్తవం కాదా అంటూ నిలదీశారు. ఒక డాక్యుమెంటు రిజిస్ట్రేషన్ చేయకుండా తిరస్కరించి, మరుసటి రోజు అదే డాక్యుమెంట్ వేరే మధ్యవర్తుల ద్వారా రిజిస్ట్రేషన్ చేయలేదా అంటూ ప్రశ్నించారు. రైతులు, రైటర్లు వరుసగా అంశాల వారీగా వివరించి ప్రశ్నించడంతో వాటికి జవాబులు చెప్పకోలేక సబ్ రిజిస్ట్రారు పార్థసారథి నీళ్ల నమిలారు. ఏదో ఒకటీ అరా తప్పులు జరిగాయని పరోక్షంగా అంగీకరించారు. ఫిర్యాదులపై సబ్ రిజిస్ట్రారు పార్థసారథిని జిల్లా కార్యాలయానికి పిలిపించి వివరణ ఇవ్వాలని అనంతరం విచారణ చేపడతామని చెప్పినట్లు తెలిసింది. కాగా ఈ విషయమై సబ్‌రిజిస్ట్రార్ పార్థసారథిని వివరణ కోరగా జిల్లా అధికారులకు అందజేసిన ఫిర్యాదులో పేర్కొన్న వాటిలో ఎలాంటి అక్రమాలు లేవని, తనకు తెలిసీ ఎలాంటి తప్పిదాలు జరగలేదన్నారు. డాక్యుమెంటు రైటర్ల మధ్య ఉన్న విభేదాలను తనకు అంటగడుతున్నారు. తాను వారి మధ్య ఎలాంటి వివక్ష చూపించలేదని, రైతులతో కూడా తాను దురుసుగా ప్రవర్తించలేదని తెలిపారు.

బాబా రాందేవ్‌కు ప్రోటోకాల్ స్వాగతం



హెలీప్యాడ్ వద్ద బాబారాందేవ్‌కు స్వాగతం పలుకుతున్న దృశ్యం

మదనపల్లె టౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మీదుగా హార్సిలీహిల్స్‌కు వెళ్లిన యోగా గురువు బాబారాందేవ్‌కు సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ ప్రోటోకాల్ స్వాగతం పలికారు. గురువారం స్థానిక బీటీ కళాశాల మైదానంలో హెలికాప్టర్ దిగిన బాబారాందేవ్‌కు సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. డీఎస్పీ మహేంద్ర ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. కాగా బాబారాందేవ్‌కు వై-ప్లస్ భద్రత ఉండటంతో కమెండోల మధ్య గట్టి భద్రత ఏర్పాటు చేశారు. అంతకు ముందు హెలిప్యాడ్‌కు చేరుకున్న డాగ్ స్క్వాడ్ పోలీసులు ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ వాహనాన్ని కూడా అణువణువూ పోలీసులు తనిఖీ చేశారు. అనంతరం ఆయన హార్సిలీహిల్స్‌కు వెళ్లి అక్కడ అంతర్జాతీయ స్థాయిలో వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు.

రాందేవ్‌ను కలిసిన బీజేపీ నాయకులు

హార్సిలీహిల్స్ పర్యటన కోసం మదనపల్లెకు హెలికాప్టర్‌లో వచ్చిన యోగా గురువు బాబా రాందేవ్‌ను బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం స్థానిక బీటీ కళాశాల మైదానంలోని హెలిప్యాడ్ వద్ద బాబా రాందేవ్‌ను విజయభారతి హైస్కూల్ కరెస్పాండెంట్ ఎన్.సేతు, బీజేపీ నాయకులు బండి ఆనంద్, భగవాన్, వెంకటరమణారెడ్డి, ఎం.కిరణ్, కలసి మాట్లాడారు.

డ్రగ్స్ మహమ్మారి అణుబాంబు కంటే ప్రమాదకరం

- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి
- డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం : కలెక్టర్ శ్రీధర్



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటి టౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ మహమ్మారి అణుబాంబు కంటే ప్రమాదకరమైందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా అంతర్జాతీయ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మంత్రితో పాటు కలెక్టర్ చామకూరి శ్రీధర్, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తదితరులు గురువారం రాయచోటి పట్టణంలోని శివాలయం సర్కిల్ నుంచి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. శివాలయం సర్కిల్ నుంచి నేతాజీ సర్కిల్ (బంగ్లా) వరకు నిర్వహించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ డ్రగ్స్ మహమ్మారి అణుబాంబు కంటే శక్తివంతమైందని, ఇది భారత దేశాన్నే కాదు యావత్ ప్రపంచాన్ని వణికిస్తోందని తెలిపారు. డ్రగ్స్ మహమ్మారిని మొక్కగా ఉన్నప్పుడే తుంచి వేసే ఉద్దేశ్యంతో విద్యార్థులకు, యువకులకు అవగాహన కల్పించి డ్రగ్స్ బారిన పడకుండా చూడాలనే ఉద్దేశ్యంతో ఇలాంటి కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తోందని తెలిపారు. మాదక ద్రవ్యాల వినియోగం, అమ్మకం, రవాణా తదితర విషయాలు మీకు తెలిసిన వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1972కు తెలియజేయాలన్నారు. కలెక్టర్ చామకూరి శ్రీధర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు మనకు కనపడకుండా మన చుట్టూ చేరి మన కుటుంబాన్ని మన భవిష్యత్తును నాశనం చేస్తాయన్నారు. పిల్లల భవిష్యత్తు ఉంటేనే రాష్ట్ర భవిష్యత్తు ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు దీనికి ఎంతో ప్రాముఖ్యతను ఇచ్చి ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహించారని తెలిపారు. జిల్లాలోని వివిధ శాఖలు, విద్యాసంస్థలు మాదక ద్రవ్యాల వ్యతిరేక ర్యాలీలో పెద్ద ఎత్తున పాల్గొన్నారని, మదనపల్లిలో 6 వేల మందితో, రాజంపేటలో 2 వేల మందితో ప్రతి మండలంలో 500 మందితో ఈ మాదక ద్రవ్యాల వ్యతిరేక ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాల వినియోగం, అమ్మకం, రవాణా చేయడం ద్వారా కేసుల్లో ఇరుక్కుని ఉద్యోగాలకు అర్హత సాధించక వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. మాదక ద్రవ్యాలు వినియోగించినా, అమ్మినా, నిల్వ ఉంచిన, రవాణా చేసినా నేరంగా పరిగణించబడుతుందని, దీనికి ఏడు సంవత్సరాలు జైలుశిక్ష విధించే అవకాశం ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకటాద్రి, రాయచోటి ఆర్డీవో శ్రీనివాసులు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్, రాయచోటి తహసీల్దార్ నరసింహకుమార్, అటవీ, వైద్య, విద్య, డ్రగ్స్ కంట్రోల్, వివిధ శాఖల అధికారులు, ఐటీఐ, పాఠశాలల ప్రతినిధులు, విద్యార్థులు, మహిళా సంఘాలు తదితరులు పాల్గొన్నారు.



రాయచోటిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

జిల్లా మాజీ వైద్యాధికారి గోపాల్‌రెడ్డి మృతి


డాక్టర్ గోపాల్‌రెడ్డి (ఫైల్)

రాజంపేట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడపజిల్లా వైద్యాధికారి డాక్టర్ రాచంరెడ్డి గోపాల్‌రెడ్డి(84) అనారోగ్యంతో మృతిచెందారు. గురువారం ఆయన స్వగ్రామం ప్రొద్దుటూరులో అంత్యక్రియలు నిర్వహించారు. సుదీర్ఘకాలం సుమారు 20 ఏళ్లు రాజంపేటలో డాక్టర్‌గా, ఉప జిల్లా వైద్యాధికారిగా వివిధ హోదాల్లో పనిచేసి తదనంతరం పదోన్నతిపై జిల్లా వైద్యశాఖాధికారిగా పనిచేశారు. రాజంపేటలో సుదీర్ఘ కాలం పనిచేసిన సమయంలో పేదలకు వైద్యసేవలు అందించడంలో పేదల డాక్టర్‌గా గుర్తింపు పొందారు. రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లోని గ్రామాల్లో వైద్యసేవలు నిర్వహించి పేదల డాక్టర్‌గా గ్రామీణ ప్రాంతాల్లో అనేక ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించి వైద్యం అందించారు. ప్రభుత్వం ప్రతియేడాది నిర్వహించిన పల్స్‌పోలియో కార్యక్రమంలో మంచి గుర్తింపు పొందారు. అదేవిధంగా అనేక సామాజిక రుగ్మతలు, సేవా కార్యక్రమాలపై అనేక కవితలు రాసి కవితాగోష్టులు నిర్వహించి ఉత్తమ రచయితగా అవార్డులు పొందారు. తన స్వగ్రామం ప్రొద్దుటూరు హౌసింగ్‌బోర్డు కాలనీలో నివాసం ఉంటూ పదవి విరమణ చేసిన తర్వాత రోటరీ సంస్థలో ఉచిత వైద్యం నిర్వహించారు. ఆయన ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో హైదరాబాదుకు తరలించగా ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. ఆయన మృతిపట్ల రాజంపేట ఎన్జీవో సంఘ మాజీ అధ్యక్షుడు లావలూరు శ్రీనివాసులు, పెన్షనర్ల సంఘం నాయకులు లక్ష్మీనరసయ్య, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సానె శేఖర్, విశ్రాంత తహసీల్దారు యంకోబరావు, తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో యువకుడు మృతి


హరీష్ (ఫైల్‌ఫొటో)

మదనపల్లెటౌన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా వచ్చి ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. గురువారం బి.కొత్తకోట మండలం గట్టు పంచాయతీ పట్రవారిపల్లెకు చెందిన కృష్ణమూర్తి కుమారుడు డి.హరీష్(24) ద్విచక్ర వాహనంలో పుంగనూరుకు వెళ్లాడు. అక్కడి నుంచి తిరిగి సొంత గ్రామానికి వెళుతుండగా మదనపల్లె మండలం వలసపల్లె పంచాయతీ బోయకొండ ఆర్చి వద్ద జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనం హరీష్ వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన హరీష్‌ను మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా ఈ ప్రమాదంలో మరో ద్విచక్ర వాహనంలో వస్తున్న పట్టణానికి చెందిన స్వామినాథన్(24) కూడా గాయపడ్డాడు. మదనపల్లె తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

● రూ.15 లక్షల ఆస్తినష్టం


దెబ్బతిన్న ఇల్లు

రామాపురం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమై రూ.15 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు రాంచెన్నారెడ్డి వాపోయాడు. మండలంలోని బండపల్లి పంచాయతీ వెంకటరెడ్డిగారిపల్లెకు చెందిన రాంచెన్నారెడ్డి బుధవారం అర్ధరాత్రి ఇంట్లో జరిగిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు వ్యాపించి ఇంట్లోని వస్తువులు బూడిద పాలయ్యాయన్నారు. రెండు సోఫాలు, 40 పట్టుచీరలు, బంగారు రూ.1.50 లక్షల నగదు, రెండు డబుల్ కాట్ మంచాలు కాలి బూడిదయ్యాయన్నారు. లక్కిరెడ్డిపల్లె ఫైర్ స్టేషన్‌కు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే నష్టం జరిగిందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు వాపోయారు.

బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ


సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న టీటీడీ చైర్మన్ తదితరులు

తిరుమల, జూన్ 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నందలూరు సౌమ్యనాథ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు, తాళ్లపాకలోని చెన్నకేశవస్వామి, సిద్దేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్లను టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈవో వెంకయ్యచౌదరి గురువారం ఆవిష్కరించారు. జూలై 4 నుంచి 13 వరకు నందలూరులో, జూలై 5 నుంచి 15 వరకు తాళ్లపాకలో బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవోలు నటేష్, ప్రశాంతి పాల్గొన్నారు.

నన్నారి షరబత్.. ఔషధ గుణాలున్న పానీయం. ఎండాకాలంలో దీనికి మించిన ఉపశమనం ఇచ్చేది మరొకటి ఉండదు. రాయలసీమలోని నల్లమల తదితర అటవీ ప్రాంతాల్లో సహజ సిద్ధంగా నన్నారి వేర్లు లభిస్తాయి. ప్రస్తుతం అటవీ ప్రాంతాల్లో నన్నారి వేర్ల లభ్యత కష్టంగా మారడంతో తమిళనాడుతో పాటు ఇతర రాష్ట్రాల్లోని రైతుల దృష్టి నన్నారి సాగు వైపు మళ్లింది. తక్కువ నీటితో అధిక దిగుబడులు, మంచి ఆదాయం వస్తుండడంతో నన్నారి వేర్ల సాగు మారుమూల ప్రాంతాలకు విస్తరిస్తోంది. ములకలచెరువు మండలంలో కూడా ఓ రైతు నన్నారి పంట సాగు చేశాడు.

నన్నారి సాగు.. భలే బాగు

● తక్కువ నీటితోనే అధిక దిగుబడి ● ఎరువులు...పురుగుల మందు అవసరమే ఉండదు ● మూడేళ్ల తరువాత దిగుబడి


నన్నారి నారు

ములకలచెరువు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె నియోజకవర్గం ములకలచెరువు మండలంలోని వేపూరికోట పంచాయతీ బంగారు వాండ్లపల్లెకు చెందిన రామిరెడ్డి మూడేళ్ల క్రితం ఐదు ఎకరాల్లో నన్నారి సాగు చేశాడు. రూ.5 లక్షలకు పైగా ఖర్చయింది. నారు నాటిన సమయంలో మాత్రమే కొంతవరకు ఎరువులు వాడాడు. పంట సాగు చేసిన మొదట్లో నెలకోసారి మొక్కలకు నీరందించేవాడు. వేసవిలో ఒకటిన్నర నెలలకొకసారి, తరువాత మూడు నెలలకొకసారి మాత్రమే నీరందించాడు. ప్రస్తుతం నన్నారి పంట కోతకు వచ్చింది. పంట సాగు చేసిన మూడేళ్ల తరువాత పదేళ్ల లోపు ఎప్పుడైనా దిగుబడి తీసుకోవచ్చు. పదేళ్ల వరకు వదిలేస్తే మరింత అధికంగా దిగుబడి పొందవచ్చు.

నష్టాల ఊసే లేదు..

నన్నారి పంట మూడేళ్ల తరువాత మూడు టన్నుల వరకు దిగుబడి వస్తుంది. పదేళ్ల లోపు తీసుకుంటే రెట్టింపు దిగుబడి వస్తుంది. వేసవిలో కేజీ నన్నారి వేర్లు రూ.500లకు పైగా పలుకుతుంది. నన్నారి సాగులో నష్టాలే రావని రైతులు అంటున్నారు. నన్నారి వేర్లకు ఎప్పుడూ డిమాండ్ ఉంటుందని, వేసవిలో అయితే మంచి ధర పలుకుతుందని చెబుతున్నారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో కూడా నన్నారి వేర్లకు డిమాండ్ ఉంది. బయటి దేశాలకు కూడా ఎగుమతి అవుతుందని చెబుతున్నారు.

కలుపు తీసే పని మాత్రమే ..

పంట సాగు చేసిన మొదట్లో మాత్రమే పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. ఎప్పటికప్పుడు కలుపు తొలగించేందుకు కొంత ఖర్చవుతుంది. మేకలు, పశువులు నన్నారి ఆకులు తినవు కాబట్టి ఈ పంటకు కాపలా ఉండాల్సిన అవసరం కూడా ఉండదు


నన్నారి వేరు

కొత్త రకం పంటల సాగుపై ఆసక్తి



కొత్త రకం పంటల సాగుపై ఆసక్తితో పదేళ్ల కిందట బటన్ రోజా పూలు సాగు చేశా. మూడేళ్ల క్రితం నన్నారి సాగు చేశాను. మంచి ధర పలికినప్పుడు వేర్లు తీయించి విక్రయించాలని నిర్ణయించుకున్నాను. ఇటీవల ఓ రైతు సాగు చేసిన నన్నారి పంటను పరిశీలించాను. అతనికి మంచి దిగుబడి వచ్చింది.

- రామిరెడ్డి, బంగారువాండ్లపల్లె

ప్రభుత్వాసుపత్రిలో పడకేసిన పారిశుధ్యం



వాడి పడేసిన మందులూ ఆసుపత్రి ఆవరణలోనే ఇలా... బాత్‌రూముల్లో అట్టముక్కలు వేసిన దృశ్యం

సిద్దవటం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవరం-1 పీహెచ్‌సీ ప్రభుత్వ ఆసుపత్రిలో పారిశుధ్యం పడకేసింది. ఆసుపత్రికి వచ్చే రోగులకు వ్యర్థాలతో కొత్త రోగాలు అంటుకుంటున్నాయని ఆందోళన చెందుతున్నారు. ఆసుపత్రి ఆవరణం మొత్తం వ్యర్థాలతో దుర్వాసనలు వెదజల్లడంతో పాటు దోమలు స్వైరవిహారం చేస్తుండడంతో రోగుల సహాయకులు సైతం అనారోగ్యం బారిన పడుతున్నామని ఆందోళన చెందుతున్నారు. ఆసుపత్రి ఆవరణంలో ఎక్కడపడితే అక్కడ కాలం చెల్లిన మందులు, సూదులను పడేశారు. డెలివరీ రూం, బాత్‌రూముల్లో అట్టపెట్టెలను పడేశారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు. ఈ విషయమై మాధవరం వైద్యాధికారి శివకుమార్‌ను వివరణ కోరగా ప్రాథమిక ఆరోగ్య పరిధి ప్రాంగణంలో ఉన్న అపరిశుభ్రతను పూర్తిగా తొలగించి డెలివరీ రూము, బాత్‌రూముల్లో ఉన్న అట్టముక్కలను తొలగిస్తామన్నారు. వైద్యశాలకు వచ్చిన రోగులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చేస్తామని వైద్యాధికారి తెలిపారు.

నాటుసారా స్వాధీనం.. ఒకరి అరెస్టు


పట్టుబడిన సారా నిందితుడితో ఎక్సైజ్ సిబ్బంది

రైల్వేకోడూరు రూరల్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపురం క్రాస్ వద్ద అక్రమంగా తరలిస్తున్న ఐదు లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేసినట్లు రైల్వేకోడూరు ఎక్సైజ్ సీఐ టి.కె.తులసి తెలిపారు. రాబడిన సమాచారం మేరకు గురువారం తనిఖీలు నిర్వహిస్తుండగా వీపీఆర్ కండ్రిగ పంచాయతీ ఎస్టీ కాలనీకి చెందిన చెంచురామయ్య వద్ద నాటుసారా స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. అక్రమంగా నాటుసారా తయారు చేసిన, విక్రయించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నాటుసారా ఎవరైనా తయారు చేస్తున్నా, తరలిస్తున్నా సమచారం ఇవ్వాలని కోరారు. ఈ దాడుల్లో సిబ్బంది చంద్రశేఖర్, శ్రీనివాసులు, మధుసూదన్ రాజు, సోమేశ్వర, రమణారెడ్డి, శివప్రసాద్ పాల్గొన్నారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలి

● ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం నేతల డిమాండ్


సమావేశంలో మాట్లాడుతున్న నరసింహులు

రాయచోటిటౌన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం నేతలు డిమాండ్ చేశారు. గురువారం రాయచోటి పట్టణంలోని కొత్తపేటలో గల ఆ సంఘ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అపస్ జిల్లా అధ్యక్షుడు నరసింహులు, గౌరవాధ్యక్షులు పరశురాంలు మాట్లాడుతూ ఇటీవల బదిలీలు పొంది గత ఎనిమిది సంవత్సరాలుగా లాంగ్ స్టాండింగ్‌లో ఉండి వివిధ రకాలుగా బదిలీలు పొందిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేసి వారి కొత్త స్థానాల్లో చేరే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం అపస్ జిల్లా సహాధ్యక్షుడు నాగేంద్రబాబు, రాష్ట్ర కార్యదర్శి మధుమతిలు మాట్లాడుతూ బదిలీలు పొందిన ఉపాధ్యాయులకు జీత బత్యాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో అపస్ నాయకులు సదాశివుడు, రెడ్డెయ్య, అపర్ణ, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎం కార్డు చోరీ చేసి రూ.25 వేలు డ్రా

నందలూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఏటీఎంలో మాయమాటలు చెప్పి ఏటీఎం కార్డు చోరీ చేసి రూ.25 వేలు విత్‌డ్రా చేసిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. బాధితుడు విశ్రాంత ఉపాధ్యాయుడు సానిపాటి నరసింహులు వివరాల మేరకు.. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఏటీఎంలో డబ్బులు విత్‌డ్రా చేసుకునేందుకు వెళ్లగా గుర్తు తెలియని వ్యక్తి మాయమాటలు చెప్పి తన ఏటీఎం కార్డును చోరీ చేసి రూ.25 వేలను డ్రా చేసుకున్నారు. ఈ విషయంపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.


నగదు పోగొట్టుకున్న బాధితుడు

సమస్యలకు తక్షణ పరిష్కారం : మంత్రి


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి

చిన్నమండెం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): సమస్యలను తక్షణ పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. చిన్నమండెం మండలంలోని తన స్వగ్రామం బోరెడ్డిగారిపల్లెలో ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్ కార్యక్రమానికి వందలాది మంది ప్రజలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యలను మంత్రికి వినిపించారు. ప్రతిఒక్కరి సమస్యను శ్రద్ధగా విన్న మంత్రి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజల ఆశయాలను సమర్థవంతంగా నెరవేర్చే దిశగా పనిచేస్తానన్నారు.

రైల్వేకోడూరు విద్యార్థి ప్రతిభ


పిడుగు కార్తీక్

రైల్వేకోడూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి జీప్యాట్ (గ్రాడ్యుయేట్ ఫార్మసీ ఆప్టిట్యూడ్ టెస్ట్) పరీక్షకు రైల్వేకోడూరు నరరాంపేటకు చెందిన విద్యార్థి పిడుగు కార్తీక్ అర్హత సాధించాడు. ఈ సందర్భంగా గురువారం విద్యార్థి మాట్లాడుతూ కడపలో బి.ఫార్మసీ పూర్తి చేశానని, తన లక్ష్యాన్ని సాధించేందుకు నిరంతరాయంగా కృషి చేసి జాతీయ స్థాయిలో నిర్వహించే జీప్యాట్ పరీక్షకు అర్హత సాధించానని తెలిపారు. కాగా విద్యార్థి విజయం పట్ల కుటుంబ సభ్యులు, బంధువులు సంతోషం వ్యక్తం చేశారు.

ఈ ఏడాదైనా నష్టాలు తీరేనా...?

● ధరల పతనంతో నేరేడు రైతుకు కోలుకోలేని దెబ్బ

● కిలో రూ.30 నుంచి రూ.50

కురబలకోట, జూన్ 26(ఆంధ్రజ్యోతి): వరుస నష్టాలను చవిచూస్తున్న నేరేడు రైతులు, వ్యాపారులకు ఈ ఏడాది కూడా నష్టాలను చవిచూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ప్రతి ఏడాది లాభాలను ఆర్జించవచ్చనే గంపెడాశతో వ్యాపారం చేసున్నారు. అయితే గత రెండేళ్లుగా విపరీతమైన పంట దిగుబడి రావడం, కరోనా తదితర కారణాలతో ధరలు తగ్గుముఖం పట్టడంతో పాటుగా ధరలు పతనమయ్యాయి. కాగా పంటపై చేసిన అప్పులు, వడ్డీలు ఎలా తీర్చాలో తెలియక లోలోపల కుమిలి పోతున్నారు. ఆరుగాలం కష్టపడి సాగు చేసిన టమోటా పంటకు కనీసం గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతన్నలు వరుస నష్టాలను చవిచూస్తున్నారు. ప్రతి ఏడాది పడమటి ప్రాంత మండలాల్లో రైతన్నలు నేరేడు పంటను సాగు చేసి లాభాలను ఆర్జించవచ్చనే గంపెడాశతో ఎదురు చూస్తున్న రైతన్నలకు ఈ ఏడాది నిరాశే ఎదురైంది. నేరేడు ధరలు ప్రస్తుతం ధరలు పతనమవడంతో రైతన్నలకు కన్నీరు పెట్టిస్తుంది. దీంతో తీవ్ర నష్టాలను చవిచూడాల్సిన పరిస్థితులు ఎదురవడంతో పంటపై చేసిన అప్పులు, వడ్డీలు ఎలా తీర్చాలో దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు.

జిల్లాలోని పడమటి ప్రాంత మండలాల్లో రైతన్నలు వ్యవసాయంపై ఆధారపడి వేలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నారు. ప్రధానంగా ఎక్కువ మంది రైతన్నలు టమోటా, మామిడి, అల్లనేరేడు తదితర పంటలను సాగు చేస్తారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అల్లనేరేడు పంట ధరలు ఒక్కసారిగా పతనమవడంతో రైతన్నలను కన్నీరు పెట్టిస్తుంది. కోరోనా దెబ్బ నుంచి కోలుకోలేని రైతన్నలకు ధరల పతనంతో మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. ఈ ఏడాది దాదాపుగా అన్ని పంటల ధరలు నిరాశాజనకంగానే ఉన్నాయి. అయితే అల్లనేరేడును సాగు చేసి లాభాలను ఆర్జించవచ్చనే కొండంత ఆశతో సాగు చేసిన రైతన్నలకు ధరలు పాతాళానికి పడిపోవడంతో వారి ఆశలను అడియాసలు చేసింది. ఈ ఏడాది దారుణంగా అల్లనేరేడు ధరలు పతనమవడంలో ఏం చేయాలో దిక్కుతోచని అయోమయ స్థితిలో రైతన్నలు పడ్డారు. కాగా ప్రతి ఏడాది అల్లనేరేడు పంట మే మాసంలో ప్రారంభమై జులై మాసం వరకు పంట దిగుబడి చేతికి వస్తుంది. ఈ పంట సీజన్ దాదాపుగా మూడు నెలలుగా వస్తుంది. కాగా ఎరువులు, క్రిమి సంహారక మందులు, కూలీలు తదితర వాటికి సంబంధించి భారీగా ఖర్చు వస్తుంది. పంట చేతికి వచ్చిన తర్వాత మార్కెట్‌లో అమ్మకానికి సిద్ధంగా ఉంచుతారు. ఇదివరలో పంట దిగుబడి తక్కువ రావడం, విపరీతమైన డిమాండ్ ఉండటంతో కిలో రూ.200 నుంచి రూ.400 వరకు పలికింది. కాగా ఇక్కడ అల్లనేరేడును కొనుగోలు చేసిన వ్యాపారులు హైదరాబాద్, విజయవాడ, మహారాష్ట్ర, తమిళనాడు తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు. ప్రస్తుతం మార్కెటింగ్ దిగుబడి అధికంగా రావడంతో డిమాండ్ అమ్మకాలు తగ్గుముఖం పట్టడంతో కొనేనాధుడు కరువయ్యారు. ప్రస్తుతం కిలో ధర రూ.30-40 మధ్య పలుకుతోంది. ఊహించని రీతిలో ఒక్కరిసారిగా ధరలు పతనం కావడం అంతుబట్టడం లేదు. కాగా ధరల పతనానికి ఇతర ప్రాంతాల్లో పంట దిగుబడి అధికంగా రావడంతో పాటు, ఎగుమతులు లేకపోవడం తదితర కారణాలతో ధరలు పతనమయ్యాయని వ్యాపారులు చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో రైతన్నలు నష్టాలను చవిచూడాల్సి వస్తోంది. ప్రభుత్వం చర్యలు తీసుకుని అల్లనేరేడు రైతులకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.


రైతుల నుంచి నేరేడు కాయలను కొనుగోలు చేసే కేంద్రం వద్ద వ్యాపారులు


అమ్మకానికి సిద్ధంగా ఉన్న అల్లనేరేడు

జాక్‌పాట్‌ను పూర్తిగా రద్దు చేస్తాం

● మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రమౌళి

గుర్రంకొండ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ వ్యవసాయ మార్కెట్ యార్డులో జాక్‌పాట్ విధానాన్ని పూర్తి స్థాయిలో రద్దు చేయిస్తామని మార్కెట్ కమిటీ చైర్మన్ కోసూరి చంద్రమౌళి పేర్కొన్నారు. గుర్రంకొండ మార్కెట్ యార్డులో గురువారం ఆయన వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ టమోటా రైతులకు భారంగా ఉన్న జాక్‌పాట్ విధానాన్ని పూర్తిగా రద్దు చేస్తామన్నారు. వ్యాపారులు మార్కెట్ యార్డులో జాక్‌పాట్ నిర్వహించకుండా తగు సూచనలు చేసినట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా మార్కెట్ యార్డులో నెల రోజుల వ్యవధిలో 15 కిలోల క్రేట్‌లను ప్రవేశపెట్టి జాక్‌పాట్‌ను లేకుండా చూస్తామన్నారు. అలాగే వ్యాపారులు అధిక కమీషన్లు వసూలు చేయకుండా తగ్గిస్తామని తెలిపారు. మార్కెట్ కమిటీ తీసుకున్న నిర్ణయాలను వ్యాపారులు పాటించాలని, లేనియెడల వ్యాపారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం మార్కెట్ యార్డులో చేయాల్సిన అభివృద్ధి పనులను పరిశీలించారు. రైతులకు అవసరమైన అన్ని వసతులను కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ నౌషాద్‌అలీ, సభ్యులు బయ్యారెడ్డి, బాబాజాన్, నాయకులు నౌషాద్‌అహ్మద్, ఎల్లుట్ల మురళీ, సుదర్శన్, ఆనంద్, మహాత్మారెడ్డి, చంద్రబాబు, సుంకర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


గుర్రంకొండ మార్కెట్‌యార్డులో వ్యాపారులతో మాట్లాడుతున్న చైర్మన్ చంద్రమౌళి

ఉద్యాన పంటలకు ప్రోత్సాహం



ఉపాధి పథకం ద్వారా అక్కులగారిపల్లెలో సాగుచేసిన కొబ్బరిచెట్లు

● నిరుపేద రైతులకు అండగా గ్రామీణ ఉపాధిహామీ పథకం
● పండ్ల తోటల సాగుకు నెలాఖరు వరకు అవకాశం

లింగాల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పండ్లతోటలు సాగుచేయాలంటే ఇపుడున్న పరిస్థితులలో సామాన్య రైతులకు శక్తికి మించిన పని. సంప్రదాయ పంటలు సాగు చేసుకుంటూ నష్టపోతున్న రైతులు ఎంతో మంది ఉన్నారు. ఉద్యాన పంటలు సాగుచేయాలంటే సహకరించని ఆర్థికపరిస్థితి. ఇటువంటి పరిస్థితులలో నలిగిపోతున్న నిరుపేద రైతుల కోసం చేయూతనందిస్తూ ప్రభుత్వం మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీథకం ద్వారా 15 రకాల పండ్లతోటల సాగుకు అవకాశం కల్పిస్తోంది. మామిడి, చీనీ, పులుసు నిమ్మ, జామ, సపోట, నేరేడు, సీతాఫలం, రేగు, కొబ్బరిచెట్లు, దానిమ్మ, అంజీర, అవకడ, చింత, డ్రాగన్ ఫ్రూట్ వంటి పండ్ల తోటలసాగుకు అయ్యే ఖర్చులు మొత్తం భరించడంతో పాటు మూడేళ్ల సంరక్షణ నిధులు ప్రతి నెల రైతు ఖాతాలో జమ చేస్తారు. అలాగే పూల తోటల సాగులో భాగంగా మల్లెపూల మొక్కల రకాలు, రోజాపూల మొక్కల రకాలు, మునగ తోట సాగుకు అయ్యే ఖర్చులు భరిస్తూ రెండు సంవత్సరాలు సంరక్షణ నిధులు ప్రతినెల మంజూరు చేస్తారు. అలాగే పొలంగట్లపై టేకు, ఎర్రచదనం, నేరేడు, సీతాఫలం, కొబ్బరిచెట్లు, మలబారు, వేప, వెదురు మొక్కలు మంజూరు చేస్తూ వాటిని సంరక్షించేందుకు రెండు సంవత్సరాలు ప్రతినెల రైతులకు డబ్బులు చెల్లిస్తారు. నిరుపేద రైతులకు ఇది చక్కని అవకాశమని.. ఈనెలాఖరులోగా దరఖాస్తు చేసుకోవచ్చని ఉపాధి హామీ పథకం ఏపీవో గంగరాజు తెలిపారు.



పెద్దకుడాలలో సాగుచేసిన చీనీచెట్లు

భారీ స్కోరు దిశగా కడప జట్టు

● 18 పరుగుల వెనకంజలో అనంతపురం



ప్రణీల్‌రెడ్డి (కడప), గురు విఘ్నేశ్ (కడప), వీరారెడ్డి (అనంతపురం)

కడప స్పోర్ట్స్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్ 19 మెన్స్ మల్టీడే (మూడురోజులు) క్రికెట్ మ్యాచ్‌లలో గురువారం కడప జట్టు కర్నూలు జట్టుపై 93 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 401 పరుగులతో పటిష్ట స్థితిలో ఉంది. మరో మ్యాచ్‌లో అనంతపురం జట్టు నెల్లూరు జట్టు కన్నా 18 పరుగుల వెనుకంజలో ఉంది. వివరాలిలా... ఏసీఏ క్రికెట్ మైదానంలో కడప-కర్నూలు జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్‌లో టాస్ నెగ్గిన కడప జట్టు బ్యాటింగ్‌కు దిగి మొదటిరోజు ఆట ముగిసే సమయానికి 93 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 401 పరుగుల భారీ స్కోరు దిశగా సాగుతోంది. ఇందులో ప్రణీల్‌రెడ్డి 201 పరుగులు, గురు విఘ్నేశ్ 139 పరుగులు చేశారు. అలాగే కేవోఆర్ఎం మైదానంలో నెల్లూరు-అనంతపురం జట్ల మధ్య జరుగు తున్న మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన నెల్లూరు జట్టు బ్యాటింగ్ చేపట్టి 50.4 ఓవర్లలో 212 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో మన్విత్‌రెడ్డి 48 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు మొదటిరోజు ఆట ముగిసే సమయానికి 34 ఓవర్లలో కేవలం ఒక వికెట్ మాత్రమే కోల్పోయి 194 పరుగులు సాధించి పటిష్ట స్థితికి చేరుకుంది. ఇందులో వీరారెడ్డి 103 పరుగులు చేయడం విశేషం.

ఉరివేసుకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాశినాయన జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వరికుంట్ల సమీపంలో జ్యోతి రోడ్డులోని అటవీ ప్రాంతంలో గుట్టపై గుర్తు తెలియని వ్యక్తి చెట్టుకు ఉరివేసుకొని మృతి చెందినట్లు ఎస్ఐ యోగేంద్ర తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు... వరికుంట్ల గ్రామా నికి చెందిన ఉపాధి కూలీలు గురువారం పనికి వెళ్లారు ఉపాధి ఎని అనంతరం కొంతమంది పశుల మేతకోసం గుట్ట ఎక్కారు. అక్కడ దుర్వాసన రావడంతో పరిశీలించగా దాదాపు 40 సంవత్సరాల వ్యక్తి చెట్టుకు ఉరివేసుకొని చనిపోయాడు. విషయం స్థానిక వీఆర్ఏ, వీఆర్వోకు తెలిపారు. వారు తమ దృష్టికి తేవడంతో వెళ్లి పరిశీలించగా శవం కుళ్లిన స్థితిలో ఉంది. దాదాపు 20 రోజుల క్రితం ఉరివేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు కేసు నమోదు చేసి అక్కడే శవపరీక్ష చేసి పూడ్చించామన్నారు.

ప్రజాస్వామ్యాన్ని భ్రష్టుపట్టించిన చరిత్ర కాంగ్రెస్‌దే

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి


కడప మారుతీనగర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ భ్రష్టు పట్టించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదేనని బీజేపీ జిల్లా అధ్యక్షుడు జంగిటి వెంకటసుబ్బారెడ్డి మండిపడ్డారు. గురువారం స్థానిక ఎన్జీవో కాలనీలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1975లో నాటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీకి సరిగ్గా 50 సంవత్సరాలు పూర్తి చేసుకుందన్నారు. అప్పట్లో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా దేశ వ్యాప్తంగా ఎమర్జెన్సీ విధిం చి ప్రతిపక్ష నాయకులను జైలులో బంధించడం దారుణమన్నారు. ఇవాళ అదే కాంగ్రెస్ నేతగా సేవలందిస్తున్న రాహుల్‌గాంధీ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మారుస్తుందంటూ ప్రచారం చేయడం విడ్డూ రంగా ఉందన్నారు. ప్రజాస్వామ్యాన్ని రక్షిస్తూ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని అమలు పరుస్తున్న దేశ ప్రధాని నరేంద్రమోదీ గొప్ప రాజకీయ నీతి జ్ఞుడు అని కొనియాడారు. గత 11 సంవత్సరాలుగా దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మనదేశాన్ని ప్రపంచంలోనే అభివృద్ధి చెందిన దేశాల సరసన సగర్వంగా తలెత్తుకునేలా మనదేశాన్ని తీర్చిదిద్దుతున్నారన్న సంగతి గుర్తు పెట్టుకోవాలన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు డాక్టర్ శివనాయక్, లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

2 నుంచి మహా గురుకులంలో తరగతులు

కడప, కలెక్టరేట్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు అధునాతన వసతులు, నాణ్యమైన విద్యనందించే లక్ష్యంతో బి.మఠంలో నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలుర మహా గురుకులంలో జూలై 2వ తేదీ నుంచి తరగతులు ప్రారంభం కానున్నట్లు కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాల్‌లో బిమఠం మండలంలో నూతనంగా ఏర్పాటైన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మహా గురుకులం (బాలుర) విద్యాలయంలో తరగతుల ప్రారంభానికి సంసిద్ధత, ఏర్పాట్లు, విద్యార్థుల అడ్మిషన్ సంబంధిత అంశాలపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బి.మఠం సమీపంలో అత్యాధునిక మౌలిక సదుపాయాలు, వసతులతో సువిశాల ప్రాంగణంలో రూపు దిద్దుకున్న మహా గురుకులం వచ్చే నెల 2వ తేదీ నుంచి పేదలకు నాణ్యమైన విద్యను అందించనున్నామన్నారు. 960 మంది విద్యార్థులకు విద్యా వసతులు కల్పించగల సామర్థ్యం ఉన్న బాలుర మహా గురుకులంలో ఈ విద్యా సంవత్సరంలో 800 మంది విద్యార్థులతో అడ్మిషన్లను పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే సగిలేరు, బి.మఠం గురుకుల పాఠశాలల పాత భవనాల్లోని 660 మది విద్యార్థులను కూడా మహా గురుకులంలోకి షిఫ్ట్ చేయడం జరుగుతోందన్నారు. కొత్త అడ్మిషన్లకు సంబంధించి కౌన్సెలింగ్ ప్రక్రియ కూడా కొనసాగుతోందన్నారు. తరగతులు ప్రారంభం నాటికి మహా గురుకులంలో ఎలాంటి మౌలిక సదుపాయాల కొరత లేకుండా చూడాలన్నారు. మహా గురుకులంలో అర్హులైన విద్యార్థులు చేరేందుకు ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో బద్వేల్ ఆర్డీవో చంద్రమోహన్, సాంఘీక సంక్షేమ గురుకులాల విద్యాలయాల జిల్లా కో-ఆర్డినేటర్ ఉదయశ్రీ, డీఈవో షంషుద్దీన్ , ఎస్ఎస్ఏ అధికారి నిత్యానందరాజులు, సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతి, కాంట్రాక్ట్ ఏజెన్సీ పీఆర్ ఏపీఎస్పీడీసీఎల్ సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డులో మైదుకూరు మెప్మా



వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డును మెప్మా అధికారిణికి అందజేస్తున్న ఎమ్మెల్యే పుట్టా

మైదుకూరు రూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాలు చేసిన ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో అధిక సంఖ్యలో కొనుగోలు చేయడం వలన రాష్ట్రంలో పలు పట్టణాలతో పాటు, మైదుకూరు మెప్మాకు వరల్డ్ బుక్‌ఆఫ్ రికార్డులో చోటు దక్కింది. ఈ మేరకు మైదుకూరుకు వచ్చిన షీల్డ్‌లను ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ చేతుల మీదుగా మెప్మా అధికారిణి కెజియా అందుకున్నారు. కార్యక్రమంలో అధికారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఫుడ్ టెక్నాలజిస్టుల పాత్ర కీలకం

● ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ

పులివెందుల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో ఫుడ్ టెక్నాలజిస్టుల పాత్ర కీలకంగా ఉందని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సెలర్ డాక్టర్ ఆర్.శారదా జయ లక్ష్మీదేవి పేర్కొన్నారు. గురువారం పులివెందుల వద్దనున్న ఆహార విజ్ఞాన శాస్త్ర, సాంకేతిక కళాశాల వద్ద కాలేజ్ అండ్ హాస్టల్‌డే సందర్భంగా వీసీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా లైవ్లీహుడ్ బిజినెస్ ఇంక్యుబేషన్‌సెంటర్, టూ-వీలర్ పార్కింగ్ షెడ్‌లను ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా వీసీ మాట్లాడుతూ పులివెందుల వద్దనున్న కళాశాలలో చక్కని వనరులు ఉన్నాయన్నారు. ఈ వనరులను ఉపయోగించుకొని విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలని ఆమె ఆకాంక్షించారు. టెక్నాలజీ విద్యార్థులకు ఉన్న ఉద్యోగ అవకాశాలను ఆమె వివరించారు. ఈ కళాశాలలో కోర్సు పూర్తవుతూనే వారు ఉద్యోగం కోసమే ఎదురుచూడాల్సిన అవసరం లేదన్నారు. సొంతంగా బిజినెస్ గాని, మార్కెటింగ్ గాని చేసుకునేలా కళాశాలలో విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామన్నారు. నూతన ఆహార పదార్థాలను కళాశాలలో తయారు చేయించి వారిచే మార్కెటింగ్ ఎలా చేయాలి, ఎక్కడెక్కడ చేయాలనే అంశం కూడా ప్రాక్టికల్‌గా చేసి చూపుతున్నామన్నారు. అనంతరం వివిధ క్రీడలు, సాంస్కృతిక పోటీలలో విజయం సాధించిన విద్యార్థులకు ఉపకుల పతి చేతుల మీదుగా బహుమతులు, సర్టిఫికెట్లను అందించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ టెక్నాలజీ డీన్ డాక్టర్ ఎ.మణి, భారత ప్రభుత్వ వ్యవ సాయ, ప్రాసెస్డ్ ఫుడ్ ప్రొడక్ట్ ఎగుమతి అభివృద్ధి అథారిటీకి సంబం ధించిన తెలంగాణ ప్రాంతీయ విభాగాధిపతి ఆర్‌పీ నాయుడు, స్పైస్ బోర్డు అధికారి జి.శివకుమార్, పులివెందుల కళాశాల అసోసి యేట్ డీన్ డాక్టర్ ఎమ్.మాధవ, తదితర అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీసీ డాక్టర్ శారదా జయలక్ష్మీదేవి

ప్రభుత్వ లాంఛనాలతో బీఎస్ఎఫ్ జవాన్ అంత్యక్రియలు



శివప్రకాష్‌రెడ్డి (ఫైల్), మృతదేహం వద్ద విలపిస్తున్న భార్య బిడ్డలు

పులివెందుల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): తొండూరు గ్రామానికి చెందిన బీఎస్ఎఫ్ జవాన్ డి.శివప్రకాష్‌రెడ్డి (42) అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించారు. శివప్రకాష్‌రెడ్డి బీఎస్ఎఫ్ జవాన్‌గా పనిచేస్తున్నారు. సెలవుపై పది రోజుల క్రితం ఇంటికి వచ్చారు. బుధ వారం పులివెందులకు వెళుతుండగా గుండెపోటు రావడంతో మృతి చెందారు. ఈ విషయాన్ని బీఎస్ఎఫ్ అధికారులకు తెలపడంతో వారు వచ్చి మృతదేహంపై జాతీయ జెండా ఉంచి గౌరవ వందనం గావించారు. అనంతరం తొండూరులో గురువారం సాయంత్రం దహనసంస్కారాలు చేపట్టారు. కాగా, శివప్రకాష్‌రెడ్డికి భార్య నాగేశ్వరి, ఇద్దరు కుమార్తెలు అక్షిత, జ్యోత్స్న, కుమారుడు రుత్విక్‌రెడ్డిలు ఉన్నారు.

ఫర్నీచర్ షాపులో అగ్ని ప్రమాదం

● రూ.30లక్షలకు పైగా ఆస్తినష్టం

బద్వేలుటౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని నెల్లూరు రోడ్ జాతీయ రహదారిలో గురువారం రాత్రి శ్రీలక్ష్మీసాయి ఫర్నీచర్ షాపులో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో రూ.30 లక్షల మేరకు ఆస్తినష్టం వాటిల్లినట్లు యజమాని క్రిష్ణ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. నెల్లూరు జిల్లా అనంతసాగరం గ్రామానికి చెందిన చెప్పలి క్రిష్ణ ఒకటిన్నర సంవత్సరం కిందట బద్వేలు ప్రాంతానికి వచ్చి భగత్‌సింగ్ కాలనీలో నివాసం ఉంటూ నెల్లూరురోడ్డులో శ్రీలక్ష్మీ సాయి ఫర్నీచర్ షాపు పెట్టుకున్నాడు. ప్రతి రోజు మాదిరే గురువారం రాత్రి 8.30 గంటలకు షాపును మూసివేసి ఇంటికి వెళ్లాడు. దుకాణం మూసివేసిన 30 నిమిషాల తరువాత దుకాణం నుంచి భారీగా పొగలు బయటకు రావడంతో దుకాణం పక్కనే ఉన్న వారు ఫైర్‌సిబ్బందికి సమాచారం అందజేశారు. వెంటనే అగ్ని మాపక అధికారి సుధాకర్, సీఐ రాజగోపాల్‌లు అక్కడకు చేరుకొని సిబ్బందితో షట్టర్‌ను ఓపెన్‌చేసి మంటలను అదుపుచేశారు. అనంతరం ఫైర్ సిబ్బంది షాపు యజమానికి సమాచారం ఇవ్వడంతో దుకాణదారుడు క్రిష్ణ అక్కడకు చేరుకున్నారు. అప్పుచేసి దుకాణం ప్రారంభించానని, ఈ అగ్నిప్రమాదంలో సుమారు రూ.30 లక్షల మేరకు ఫర్నీచర్ సామగ్రి అగ్నికి ఆహుతి అయిందంటూ లబోదిబోమంటున్నాడు. అగ్నిమాపక అధికారులను వివరణ కోరగా.. ఆస్తినష్టాన్ని అంచనా వేస్తున్నామని, రెండు రోజుల్లో పూర్తి వివరాలను తెలియ జేస్తామన్నారు.



అగ్నిప్రమాదానికి ఆహుతి అయిన ఫర్నీచర్

వైసీపీ నేత అక్రమ నిర్మాణం కూల్చేందుకు యత్నం

● అడ్డుకున్న వైసీపీ శ్రేణులు ● బయనపల్లెలో ఉద్రిక్తం

బద్వేలు రూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బయనపల్లె చెరువులో వైసీపీ నేత నాగిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి నిర్మించిన అక్రమ కట్టడాన్ని కూల్చివేసేందుకు అధికారులు యత్నించారు. బయనపల్లె గ్రామానికి చెందిన వైసీపీ వాలంటరీ విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి చెరువులో అక్రమంగా ఇంటి నిర్మాణం చేపట్టాడు. దాదాపు ఐదేళ్లుగా అదే ఇంటిలో నివాసం ఉంటున్నారు. ఇటీవల అధికారులు చెరువులు, ప్రభుత్వ భూముల్లో అక్రమ కట్టడాల కూల్చివేత కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా గురువారం ఇరిగేషన్ డీఈ వేణుగోపాల్‌రెడ్డి, రూరల్ ఎస్ఐ శ్రీకాంత్, అట్లూరు ఎస్ఐ రామక్రిష్ణ, బి.కోడూరు ఎస్ఐ సురేశ్‌లతో పాటు తహసీల్దారు ఉదయభాస్కర్‌రాజు, పోలీసు, రెవెన్యూ సిబ్బందితో కలిసి గ్రామానికి చేరుకుని వైసీపీ నేత ఇంటి నిర్మాణం తొలగించేందుకు ప్రయత్నాలు చేపట్టారు. సాయంత్రం 4 నుంచి రాత్రి 9 వరకు అక్రమ కట్టడాన్ని కూల్చివేసేందుకు ప్రయత్నించారు. ఎక్స్‌కవేటర్, ఫైరింజను కూడా తెచ్చి సిద్ధంగా ఉంచారు. ఈ విషయం తెలిసిన శ్రీకాంత్‌రెడ్డి అనుచరులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు తీవ్రంగా ప్రతిఘటించారు. మున్సిపల్ చైర్మన్ వాకమల్ల రాజగోపాల్ రెడ్డి, జడ్పీటీసీ వంకెల చిన్న పోలిరెడ్డి తదితర నాయకులతో సహా అందరూ బయనపల్లెకు చేరుకుని అధికారులతో మాట్లాడారు. తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కూల్చివేయడం ఏమిటని వారు ఇరిగేషన్ డీఈని ప్రశ్నించారు. కూల్చేందుకు వీలు లేదంటూ వైసీపీ నాయకులు కార్యకర్తలతో పాటు నాగిరెడ్డి కుటుంబ సభ్యులు, మహిళలు అడ్డుకున్నారు. దీంతో మీరు చెరువులో కట్టడం నిర్మిస్తున్నారన్న విషయం తెలియదా అని శ్రీకాంత్‌రెడ్డిని డీఈ ప్రశ్నించారు. దీంతో వారి మధ్య వాగ్వాదం జరిగి... గ్రామం లో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. రాత్రి వరకూ పోలీసులు, రెవె న్యూ సిబ్బంది, ఇరిగేషన్ డీఈ అక్రమ కట్టడాన్ని పోలీసు సిబ్బంది సహకారంతో కూల్చివేసేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు.



శ్రీకాంత్‌రెడ్డి ఇంటి వద్ద గుమికూడిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు



అధికారులతో వాగ్వాదం చేస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి

గండిక్షేత్రంలో వేలం వాయిదా

చక్రాయపేట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంలో పూలు విక్రయం, టోల్‌గేట్ వసూలుకు నిర్వహించిన వేలం వాయిదా వేసినట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. గురువారం స్థానిక గండి క్షేత్రంలోని ఆలయ ఆవరణలో పూలు విక్రయం, టోల్ గేట్ వసూలుకు బహిరంగ వేలం నిర్వహించారు. పూల విక్రయానికి సంబం ధంచి ఆరుగురు, టోల్ గేట్ వసూలుకు ఐదుగురు మాత్రమే పాల్గొన్నారన్నారు. బహిరంగ వేలంలో పాటదా రులు ఎవరూ పాటపాడేందుకు ముందుకు రానందున నిలిపి వేశామన్నారు.

అలాగే దేవస్థాన షాపింగ్ కాంప్లెక్స్ లోని 44 షాపులకు సంబంధించి హిందువులకు మాత్రమే పాల్గొనే అవకాశం కల్పించాలని బీజేపీ, విశ్వహిందూ పరిషత్ వారు లేఖల ద్వారా తెలియజేసినందున బహిరంగ వేలం తాత్కాలికంగా నిలుపుదల చేశామన్నారు. ఈ బహిరంగ వేలంలో జిల్లా దేవదాయశాఖ అధికారి మల్లికార్జునప్రసాద్, దేవస్థాన చైర్మన్ కృష్ణతేజ, మాజీచైర్మన్ వెంకటస్వామి, దేవస్థానం ప్రధాన అర్చకులు కేసరి, ఉప ప్రధాన అర్చకులు రాజా రమేష్, ఆలయ, బ్యాంకు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉందాం



చిన్నమండెం: మాదక ద్రవ్యాలపై మానవహారం నిర్వహిస్తున్న దృశ్యం... రైల్వేకోడూరులో ర్యాలీ... సుండుపల్లెలో మానవహారం ఏర్పాటు చేసిన అధికారులు, విద్యార్థులు

రాజంపేట టౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటే ఆరోగ్యంగా ఉంటామని ఆహ్లాదరమైన జీవితాన్ని గడుపుదామని రాజంపేట జనసేన పార్లమెంట్ సమన్వయకర్త యల్లటూరు శ్రీనివాస రాజు, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు అన్నారు. గురువారం మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పోస్టర్లను విడుదల చేసి విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం అన్నమాచార్య యూనివర్సిటీలోని ఇంజనీరింగ్ ఫార్మసీ పీజీ కళాశాలకు చెందిన ప్రిన్సిపాల్ ఎస్ఎంవీ నారాయణ, స్వర్ణలత, సమతానాయుడు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అన్నమాచార్య కళాశాల నుంచి కడప- చెన్నై ప్రధాన రహదారి మీదుగా అన్నమయ్య 108 అడుగుల విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో విద్యార్థులు, అంగన్వాడీ కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు పాల్గొని ప్లకార్డులు చేతబూని మాదకద్రవ్యాల నివారణపై నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాజంపేట జనసేన పార్లమెంట్ సమన్వయకర్త యల్లటూరు శ్రీనివాసరాజు, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు మాట్లాడుతూ దేశ భవిష్యత్ అభివృద్ధిని నిర్దేశించే యువత మాదకద్రవ్యాలకు అలవాటు పడి తమ జీవితాలను పాడు చేసుకుంటున్నారన్నారు. తాత్కాలిక ఆనందం కోసం యువత మత్తుకు బానిస అవుతోందని, గంజాయి, రసాయనం కలిసిన తెల్లకల్లు, మత్తు ఇంజక్షన్లు తీసుకుంటుండటంతో తమ కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయన్నారు.

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

సుండుపల్లె, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): గంజాయి, మద్యం, మత్తు యువతను చిత్తు చేస్తోందని, దానికి దూరంగా ఉండాలని మండల విద్యాశాఖ అధికారి రవీంద్రనాయక్ తెలిపారు. గురువారం సుండుపల్లె మండల కేంద్రంలోని అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, పాఠశాలల, కళాశాలల విద్యార్థులు, స్థానిక ప్రజలు మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, కరస్పాండెంట్ నాగేశ్వరరావు, పోలీసులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌లేని సమాజం కోసం కృషి చేద్దాం

నందలూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ లేని సమాజం కోసం కలిసికట్టుగా కృషి చేద్దామని తహసీల్దారు అమరేశ్వరి, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి, ఎంపీడీవో రాధాకృష్ణన్‌రాజు పిలుపునిచ్చారు. నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి బస్టాండు కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు.

డ్రగ్స్‌ను పారదోలుదాం

ఓబులవారిపల్లె, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : డ్రగ్స్‌ను పారదోలుదాం అని తహసీల్దారు యామిని, ఎంపీడీవో మల్‌రెడ్డి, ఎస్ఐ మహేష్ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, హైస్కూల్ విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. జూనియర్ కళాశాల నుంచి చిన్నఓరంపాడు క్రాస్ రోడ్డు వరకు ర్యాలీగా వచ్చి మానవహారంగా ఏర్పడి మత్తు పదార్థాలపై నినాదాలు చేశారు.

డ్రగ్స్ యువతకు పెనుముప్పు

గాలివీడు, జూన్26(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ వాడడం యువతకు యువతకు పెనుముప్పు అవుతుందని తహసీల్దార్ భాగ్యలత, ఎంపీడీవో చంద్రమౌళి అన్నారు. విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. మండల విద్యాధికారు లు నాగరాజు, శ్రీనివాసులు, విద్యార్థులు, ఉపాధ్యాయలు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల జోలికి వెళ్లొద్దు

రైల్వేకోడూరు, జూన్26(ఆంధ్రజ్యోతి): యువత మాదకద్రవ్యాల జోలికి వెళ్లొద్దని రైల్వేకోడూరు తహసీల్దార్ అమర్‌నాథ్ సూచించారు. విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో నాగార్జునరావు, సీఐ కే.హేమసుందరరావు, ఎస్ఐ వీఎల్ ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.



పెనగలూరులో మానవహారంగా ఏర్పడిన అధికారులు, విద్యార్థులు

పుల్లంపేటలో...

పుల్లంపేటలో మండల స్థాయి అధికారులు, సిబ్బంది భారీ ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో శిరీషా మాట్లాడుతూ మత్తు పదార్థాల వల్ల యువత జీవితాలు నాశనం చేసుకుంటున్నారని, తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. తహసీల్దారు పుల్లారెడ్డి, ఎస్ఐ శివప్రసాద్, ఎంఈవో చక్రధర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

సిద్ధవటం: డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడానికి ప్రతిఒక్కరూ తోడ్పడాలని తహసీల్దారు తిరుమలబాబు తెలిపారు. సిద్ధవటంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనతో పాటు ఎక్సైజ్ సీఐ రాజశేఖర్, మండల అభివృద్ధి అధికారి ఫణిరాజకుమారి పాల్గొన్నారు.

పెనగలూరు: యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని పెనగలూరు పీహెచ్‌సీ డాక్టర్ శ్రేయ, ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆదర్శ పాఠశాల ప్రాంగణంలో నాలుగు ఉన్నత పాఠశాలలు, మూడు జూనియర్ కళాశాలల విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. ఎంపీడీవో ఎస్.విజయరావు, తహసీల్దారు డి.అమరేశ్వరి, ఏపీఎం నిరంజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంబేపల్లె: సంబేపల్లె, జూన్26(ఆంధ్రజ్యోతి): విద్యార్థు లు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎంపీడీవో రామచంద్ర, ఎస్ఐ భక్తవత్సలం తెలిపారు. ఎంపీడీవో కార్యాలయం నుంచి వడ్లపల్లి రోడ్డు వరకు జాతీయ రహదారిపై విద్యార్థులు, వెలుగు మహిళలు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లతో ర్యాలీ నిర్వహించి హైస్కూల్‌కు ఎదురుగా మానవహారంగా ఏర్పడి మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రయోజనాలను వివరించారు.

చిన్నమండెం: ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు ప్లకార్డులు చేపట్టి ర్యాలీ నిర్వహించారు. మల్లూరు జెడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం రెడ్డెన్న ఆధ్వర్యంలో విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించారు.

లక్కిరెడ్డిపల్లె: యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటేనే మంచి భవిష్యత్తు ఉంటుందని ఎంపీడీవో రాషారాణి, ఎక్సైజ్ సీఐ కిశోర్ కుమార్ పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వ కార్యాల పని చేసే సిబ్బంది స్థానిక తహసీల్దార్ కార్యాల నుంచి మూడు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు.

పట్టించుకోండి సారూ..



రైల్వేకోడూరు పట్టణం ప్రధానదారి నుంచి బృందావనం కాలనీ, రంగనాయకులపేటకు వెళ్లే మార్గంలో మురుగు నీటి కాలువ బండ విరిగి పోవడంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. రాత్రి వేళలో వాహనదారులు కిందపడి గాయాలపాలవుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

- రైల్వేకోడూరు, (ఆంధ్రజ్యోతి)

మాజీ సైనికులకు సన్మానం



మాజీ సైనికులను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

రైల్వేకోడూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): సంవిధాన్ హత్యా దివస్ కార్యక్రమంలో భాగంగా గురువారం రైల్వేకోడూరులో మాజీ సైనికులను బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. మాజీ సైనికులు బండి గోపాల్, సుబ్బరామయ్య, కాకర్ల రాజగోపాల్, గూడూరు మధుసూధన్‌రాజు ఎమర్జెన్సీ రద్దుకు, ప్రజాస్వామ్య పునరుద్ధరణకు కృషి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కన్వీనర్ పులపుత్తూరు రామసుబ్బారెడ్డి, జిల్లా కో-కన్వీనర్ తోట శ్రీనివాసులు, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు జయప్రకాష్, శివరాజు, పనతల కోటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

ఉప ముఖ్యమంత్రిని కలిసిన సాయిలోకేశ్



ఉప ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేస్తున్న సాయిలోకేశ్

రాజంపేట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ను గురువారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరితో పాటు కలిశారు. ఈ సందర్భంగా సాయిలోకేశ్ మాట్లాడుతూ కడప - రేణిగుంట నాలుగులైన్ల రహదారికి అటవీ అనుమతులు లేకపోవడంతో నిర్మాణ పనులు చేపట్టేందుకు ఆలస్యమవుతోందని పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ రహదారిపై నిత్యం 15 వేలకు పైగా వాహన రాకపోకలు ఉండటం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ఇటీవల చాలామంది ప్రాణాలు కోల్పోయారని ఉప ముఖ్యమంత్రికి వివరించామన్నారు. ఇందుకు స్పందించిన పవన్‌కళ్యాణ్ అటవీ అనుమతులు ఇచ్చి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు.

రేపు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

మదనపల్లె టౌన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మదనపల్లె ఆర్టీసీ టు డిపో పరిధిలో నెలకొన్న సమస్యలపై డయల్ యువర్ డీఎం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ ట్రాఫిక్ సీఐ గీత పేర్కొన్నారు. శనివారం ఉదయం 11 గంటలకు ప్రయాణికులు డిపో మేనేజర్‌కు ఫోన్ చేయవచ్చన్నారు.

భక్తిశ్రద్ధలతో గంగమ్మ జాతర



గంగమ్మ సేవలో గ్రామస్థులు

రైల్వేకోడూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డివారిపల్లె పంచాయతీ పరిధిలో ఉన్న సత్యనారాయణపురంలో గురువారం గంగమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. బుధవారం నుంచి గ్రామస్థులు గంధం చిరంజీవి, గుంటూరు ప్రజాపతి, ఈశ్వరయ్య, జీవా, ఖాదర్‌భాషా, శంకర్ ఆధ్వర్యంలో జాతర ప్రారంభించారు. దున్నపోతును ఊరేగించారు. రాత్రి గంగమ్మతల్లిని మట్టితో తయారు చేశారు. గురువారం తెల్లవారుజామున అమ్మవారిని ఊరేగించారు. కాగా శుక్రవారం ఉదయం గంగమ్మతల్లి నిమజ్జనంతో జాతర ముగుస్తుంది.

మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం



మాట్లాడుతున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

సిద్దవటం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యమని ప్రైమరీ హెల్త్‌సెంటర్ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని పి.కొత్తపల్లె వైద్యాధికారిగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసులరెడ్డి కడప రిమ్స్ వైద్యశాలకు బదిలీ కావడంతో ఆస్థానంలో రిమ్స్‌లో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు.

ఉపాధి హామీ పనుల తనిఖీ



ఉపాధి పనులను తనిఖీ చేస్తున్న ఏపీవో నరసింహులు

సిద్దవటం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ కూలీలు చేపడుతున్న పనులను ఆకస్మిక తనిఖీ చేసినట్లు ఏపీవో నరసింహులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలు చేసిన పనులకు నగదు చెల్లింపునకు అధికారులకు నివేదిక పంపించామని, ఒక వారం రోజుల్లో నగదు చెల్లిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ పుల్లయ్య, మేట్‌లు, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మతల్లి మండపంలో అన్నదానం



గంగమ్మతల్లి మండపం వద్ద పేదలకు అన్నదానం చేస్తున్న పోతురాజు కుటుంబ సభ్యులు

రైల్వేకోడూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గంగమ్మతల్లి మండపంలో గురువారం కూటమి నాయకులు పోతురాజు నవీన్, పోతురాజు సుమన్ కుటుంబ సభ్యులు కలిసి పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గురువారం దాతలు పేదలకు అన్నదానం చేసే ఆనావాయితీని కమిటీ ప్రవేశ పెట్టిందన్నారు. దీంతో దాతలు చాలా మంది అన్నదానం చేసేందుకు ముందుకు వచ్చారన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



మంత్రిని కలిసిన టీడీపీ నాయకులు

ఒంటిమిట్ట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర మంత్రి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారని టీడీపీ మండల నాయకులు తెలిపారు. గురువారం రాయచోటిలోని గెస్ట్‌హౌస్‌లో మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని వారు కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జడ్పీటీసీ ఎన్నికలపై మంత్రితో చర్చించినట్లు పేర్కొన్నారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించి మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపినట్లు వారు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు గజ్జల నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి బొబ్బిలి రాయుడు, మండల పార్టీ సీనియర్ నాయకులు క్లాస్-1 కాంట్రాక్టర్ ఎస్వీ రమణ, చింతరాజుపల్లె సర్పంచ్ ప్రతినిధి బొడ్డే వెంకటరమణనాయుడు, రాజంపేట బీసీసెల్ అధ్యక్షుడు ఎంవీ రమణ, లీగల్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి రామదాసు, పత్తి సుబ్బరాయుడు, లక్ష్మిరెడ్డి ఉన్నారు.

కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

● మండల ప్రత్యేకాధికారి బ్రహ్మయ్య

ఒంటిమిట్ట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని మండల స్పెషల్ ఆఫీసర్ బ్రహ్మయ్య పేర్కొన్నారు. గురువారం మండలంలోని రాచగుడిపల్లె ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు ఎంపీపీ లక్ష్మీదేవి తన సొంత నిధులతో నోటుపుస్తకాలు, పరీక్ష అట్ట తదితర 13 రకాల వస్తువులను ఉచితంగా పంపిణీ చేశారు. ఎంపీపీ నల్గొండ లక్ష్మీదేవి, తహసీల్దారు దామోదర్‌రెడ్డి, ఎంపీడీవో సుజాతమ్మ, ఎంపీపీ ప్రతినిధి నల్గొండ వెంకటసుబ్బారెడ్డి, ఎంఈవోలు వెంకటసుబ్బయ్య, ప్రభాకర్, ఈవోపీఆర్డీ ప్రసాద్, టీడీపీ మండల నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్ బ్రహ్మయ్య

ప్రకృతి వ్యవసాయం ఆదాయ మార్గం

● ప్రకృతి వ్యవసాయ అధికారులు

చిన్నమండెం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం ఆదాయ మార్గమని ప్రకృతి వ్యవసాయ అధికారులు తెలిపారు. మండలంలోని బలిజపల్లె గ్రామంలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ 20 సెంట్ల భూమిలో ఏటీఎం (ఎనీ టైమ్ మనీ) మోడల్ విత్తనాలు వేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ వినీలా, ఎస్ఎఫ్ఏ చిరంజీవి, ఏఎంఎంటీ చంద్రశేఖర్, డీఎంఎంటీ రెడ్డెయ్య, చలపతినాయుడులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి సేద్యం ద్వారా తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం పొందొచ్చని పేర్కొన్నారు. ఈ పద్ధతిలో పండించిన పంటలను ఆహారంగా తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని తెలిపారు. మోడల్‌లో దుంప జాతి, తీగజాతి, ఆకుకూరలు, మొక్కజొన్న, టమోటా, వంకాయ, చిక్కుడు, గోరుచిక్కుడు, జొన్నలు సహా 20 రకాల విత్తనాలను బీజామృతతో విత్తనశుద్ధి చేసి ఘనజీవామృతంతో విత్తనాలు వేశారు. ఏటీఎం మోడల్ ద్వారా కలుపు నివారణ, నేల తేమ నిలుపుదల, 365 రోజులు పంట సాగు, జీవవైవిధ్యం పెరుగుదలతో పాటు నెలకు సగటున రూ.15 వేలు ఆదాయం అందుతోంది. ఈ కార్యక్రమంలో గంగాదేవి, నాగరాజులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

నట్టల నివారణ కార్యక్రమాన్ని వినియోగించుకోండి



సుండుపల్లె: గొర్రెలకు నట్టల నివారణ మందులు వేస్తున్న డాక్టర్ గుణశేఖర్‌పిళ్లై

సిద్దవటం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : నట్టల నివారణ కార్యక్రమాన్ని పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని వెటర్నరి లైవ్‌స్టాక్ అసిస్టెంట్ రాజేశ్వరి అన్నారు. సిద్దవటం వెటర్నరి వైద్యశాలలో అసిస్టెంట్ డైరెక్టర్ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో గొర్రెలు, మేకలు, బర్రెలకు నట్టల నివారణకు ఆల్బెండజల్ 10 ఎంఎల్, డీవార్మింగ్ వేశారు. వెటర్నరి అసిస్టెంట్ నంద్యాల, క్రిష్ణ, విజయభాస్కర్ పాల్గొన్నారు.

సుండుపల్లె: గొర్రెలు, మేకలకు ఉచితంగా నట్టల నివారణ మందులను అందజేస్తున్నట్లు డాక్టర్ గుణశేఖర్‌పిళ్లై తెలిపారు. గురువారం సుండుపల్లె మండల కేంద్రానికి సమీపంలోని ఈడిగపల్లెలో గొర్రెలకు నట్టల నివారణ మందులను వేసినట్లు తెలిపారు.

బర్రెల పొదుగు వ్యాధిపై జాగ్రత్త వహించండి



పశువైద్యశాలలో పొదుగు వ్యాధితో ఉన్న బర్రెకు చికిత్స అందిస్తున్న వైద్యసిబ్బంది

సిద్దవటం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : పాడిరైతులు బర్రెల పొదుగు వ్యాధిపై జాగ్రత్త వహించాలని వెటర్నరి లైవ్‌స్టాక్ అసిస్టెంట్ జిలాని బాషా తెలిపారు. మండలంలోని జ్యోతి పశువైద్యశాలలో గురువారం పాడిరైతు పిన్నపురెడ్డి రామ్మూర్తిరెడ్డి బర్రెకు పొదుగు వ్యాధి ప్రబలడంతో మాచుపల్లె వెటర్నరి వైద్యాధికారి విజయరాజు సూచనల మేరకు వైద్యసిబ్బంది చికిత్స అందించారు. ఈ సందర్భంగా జిలానిబాషా మాట్లాడుతూ పొదుగు వ్యాధి సోకిన బర్రెల పాల దిగుబడి పూర్తిగా తగ్గిపోవడంతో రైతులు నష్టపోతారన్నారు. బర్రెలను శుభ్రంగా పెట్టుకోవాలన్నారు. బర్రెలు, గేదెలు మేకల గొర్రెల ఆరోగ్య సమస్యలపై వైద్యాధికారి సూచనలతో సిబ్బంది అందుబాటులో ఉంటారని, వినియోగించుకోవలన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న మల్లెం హేమంత్

రైల్వేకోడూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలని రాయలసీమ విద్యార్థి పరిరక్షణ సమితి జోనల్ అధ్యక్షుడు మల్లెం హేమంత్‌కుమార్ తెలిపారు. గురువారం రైల్వేకోడూరు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల హైస్కూలులో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మధ్యాహ్న భోజన వసతులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి ఆరా తీశామన్నారు. భవనాలను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాల మెయిన్ గేట్ నిరంతరాయంగా తెరిచి ఉండం మంచిది కాదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రామయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఏఆర్ కానిస్టేబుల్ మృతి

కడప క్రైం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని మృత్యుంజయకుంటలో నివాసం ఉంటున్న ఏఆర్ కానిస్టేబుల్ ఖాజావలీ (50) ప్రమాదవశాత్తు కిందపడి ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందినట్లు చిన్న చౌకు ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి గురువారం తెలిపారు. అన్నమయ్య జిల్లాలో ఏఆర్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న ఖాజీవలీ గురువారం కడపలోని తన నివాసానికి వచ్చారు. అలాగే రామకృష్ణా నగర్‌లో ఉన్న మరో ఇంటికి పైకప్పు బాగు చేయించేందుకు వెళ్లి అక్కడ పని ముగించుకుని తిరిగి ఇంటికి వచ్చి ప్రమాదవశాత్తు కింద పడటంతో తలకు తీవ్ర గాయమైనట్లు తెలిపారు. ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

జిల్లా మాజీ వైద్యాధికారి గోపాల్‌రెడ్డి మృతి


డాక్టర్ గోపాల్‌రెడ్డి (ఫైల్)

రాజంపేట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడపజిల్లా వైద్యాధికారి డాక్టర్ రాచంరెడ్డి గోపాల్‌రెడ్డి(84) అనారోగ్యంతో మృతిచెందారు. గురువారం ఆయన స్వగ్రామం ప్రొద్దుటూరులో అంత్యక్రియలు నిర్వహించారు. సుదీర్ఘకాలం సుమారు 20 ఏళ్ల రాజంపేటలో డాక్టర్‌గా, ఉప జిల్లా వైద్యాధికారిగా వివిధ హోదాల్లో పనిచేసి తదనంతరం పదోన్నతిపై జిల్లా వైద్యశాఖా ధికారిగా పనిచేశారు. రాజంపేటలో సుదీర్ఘ కాలం పనిచేసిన సమయంలో పేదలకు వైద్యసేవలు అందించడంలో పేదల డాక్టర్‌గా గుర్తింపు పొందారు. రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లోని గ్రామాల్లో వైద్యసేవలు నిర్వహించి పేదల డాక్టర్‌గా గ్రామీణ ప్రాంతాల్లో అనేక ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించి వైద్యం అందించారు. ప్రభుత్వం ప్రతియేడాది నిర్వహించిన పల్స్‌పోలియో కార్యక్రమంలో మంచి గుర్తింపు పొందారు. అదేవిధంగా అనేక సామాజిక రుగ్మతలు, సేవా కార్యక్రమాలపై అనేక కవితలు రాసి కవితాగోష్టులు నిర్వహించి ఉత్తమ రచయితగా అవార్డులు పొందారు. తన స్వగ్రామం ప్రొద్దుటూరు హౌసింగ్‌బోర్డు కాలనీలో నివాసం ఉంటూ పదవి విరమణ చేసిన తర్వాత రోటరీ సంస్థలో ఉచిత వైద్యం నిర్వహించారు. ఆయన ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో హైదరాబాదుకు తరలించిగా ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. ఆయన మృతిపట్ల రాజంపేట ఎన్జీవో సంఘ మాజీ అధ్యక్షుడు లావలూరు శ్రీనివాసులు, పెన్షనర్ల సంఘం నాయకులు లక్ష్మీనరసయ్య, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సానె శేఖర్, విశ్రాంత తహసీల్దారు యంకోబరావు, తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో యువకుడు మృతి


హరీష్ (ఫైల్‌ఫొటో)

మదనపల్లెటౌన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా వచ్చి ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. గురువారం బి.కొత్తకోట మండలం గట్టు పంచాయతీ పత్రవారిపల్లెకు చెందిన కృష్ణమూర్తి కుమారుడు డి.హరీష్(24) ద్విచక్ర వాహనంలో పుంగనూరుకు వెళ్లాడు. అక్కడి నుంచి తిరిగి సొంత గ్రామానికి వెళుతుండగా మదనపల్లె మండలం వలసపల్లె పంచాయతీ బోయకొండ ఆర్చి వద్ద జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనం హరీష్ వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన హరీష్‌ను మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా ఈ ప్రమాదంలో మరో ద్విచక్ర వాహనంలో వస్తున్న పట్టణానికి చెందిన స్వామినాథన్(24) కూడా గాయపడ్డాడు. మదనపల్లె తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

- రూ.15 లక్షల ఆస్తినష్టం


దెబ్బతిన్న ఇల్లు

రామాపురం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమై రూ.15 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు రాంచెన్నారెడ్డి వాపోయాడు. మండలంలోని బండపల్లి పంచాయతీ వెంకటరెడ్డిగారిపల్లెకు చెందిన రాంచెన్నారెడ్డి బుధవారం అర్ధరాత్రి ఇంట్లో జరిగిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు వ్యాపించి ఇంట్లోని వస్తువులు బూడిద పాలయ్యాయన్నారు. రెండు సోఫాలు, 40 పట్టుచీరలు, బంగారు రూ.1.50 లక్షల నగదు, రెండు డబుల్ కాట్ మంచాలు కాలి బూడిదయ్యాయన్నారు. లక్కిరెడ్డిపల్లె ఫైర్ స్టేషన్‌కు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే నష్టం జరిగిందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు వాపోయారు.

బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ


సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న టీటీడీ చైర్మన్ తదితరులు

తిరుమల, జూన్ 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నందలూరు సౌమ్యనాథ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు, తాళ్లపాకలోని చెన్నకేశవస్వామి, సిద్దేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్లను టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈవో వెంకయ్యచౌదరి గురువారం ఆవిష్కరించారు. జూలై 4 నుంచి 13 వరకు నందలూరులో, జూలై 5 నుంచి 15 వరకు తాళ్లపాకలో బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవోలు నటేష్, ప్రశాంతి పాల్గొన్నారు.

నన్నారి షరబత్.. ఔషధ గుణాలున్న పానీయం. ఎండాకాలంలో దీనికి మించిన ఉపశమనం ఇచ్చేది మరొకటి ఉండదు. రాయలసీమలోని నల్లమల తదితర అటవీ ప్రాంతాల్లో సహజ సిద్ధంగా నన్నారి వేర్లు లభిస్తాయి. ప్రస్తుతం అటవీ ప్రాంతాల్లో నన్నారి వేర్ల లభ్యత కష్టంగా మారడంతో తమిళనాడుతో పాటు ఇతర రాష్ట్రాల్లోని రైతుల దృష్టి నన్నారి సాగు వైపు మళ్లింది. తక్కువ నీటితో అధిక దిగుబడులు, మంచి ఆదాయం వస్తుండడంతో నన్నారి వేర్ల సాగు మారుమూల ప్రాంతాలకు విస్తరిస్తోంది. ములకలచెరువు మండలంలో కూడా ఓ రైతు నన్నారి పంట సాగు చేశాడు.

నన్నారి సాగు.. భలే బాగు

- తక్కువ నీటితోనే అధిక దిగుబడి
- ఎరువులు...పురుగుల మందు అవసరమే ఉండదు
- మూడేళ్ల తరువాత దిగుబడి


నన్నారి నారు

ములకలచెరువు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె నియోజకవర్గం ములకలచెరువు మండలంలోని వేపూరికోట పంచాయతీ బంగారు వాండ్లపల్లెకు చెందిన రామిరెడ్డి మూడేళ్ల క్రితం ఐదు ఎకరాల్లో నన్నారి సాగు చేశాడు. రూ.5 లక్షలకు పైగా ఖర్చయింది. నారు నాటిన సమయంలో మాత్రమే కొంతవరకు ఎరువులు వాడాడు. పంట సాగు చేసిన మొదట్లో నెలకోసారి మొక్కలకు నీరందించేవాడు. వేసవిలో ఒకటిన్నర నెలలకొకసారి, తరువాత మూడు నెలలకొకసారి మాత్రమే నీరందించాడు. ప్రస్తుతం నన్నారి పంట కోతకు వచ్చింది. పంట సాగు చేసిన మూడేళ్ల తరువాత పదేళ్ల లోపు ఎప్పుడైనా దిగుబడి తీసుకోవచ్చు. పదేళ్ల వరకు వదిలేస్తే మరింత అధికంగా దిగుబడి పొందవచ్చు.

నష్టాల ఊసే లేదు..

నన్నారి పంట మూడేళ్ల తరువాత మూడు టన్నుల వరకు దిగుబడి వస్తుంది. పదేళ్ల లోపు తీసుకుంటే రెట్టింపు దిగుబడి వస్తుంది. వేసవిలో కేజీ నన్నారి వేర్లు రూ.500లకు పైగా పలుకుతుంది. నన్నారి సాగులో నష్టాలే రావని రైతులు అంటున్నారు. నన్నారి వేర్లకు ఎప్పుడూ డిమాండ్ ఉంటుందని, వేసవిలో అయితే మంచి ధర పలుకుతుందని చెబుతున్నారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో కూడా నన్నారి వేర్లకు డిమాండ్ ఉంది. బయటి దేశాలకు కూడా ఎగుమతి అవుతుందని చెబుతున్నారు.

కలుపు తీసే పని మాత్రమే ..

పంట సాగు చేసిన మొదట్లో మాత్రమే పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. ఎప్పటికప్పుడు కలుపు తొలగించేందుకు కొంత ఖర్చవుతుంది. మేకలు, పశువులు నన్నారి ఆకులు తినవు కాబట్టి ఈ పంటకు కాపలా ఉండాల్సిన అవసరం కూడా ఉండదు


నన్నారి వేరు

కొత్త రకం పంటల సాగుపై ఆసక్తి



కొత్త రకం పంటల సాగుపై ఆసక్తితో పదేళ్ల కిందట బటన్ రోజా పూలు సాగు చేశా. మూడేళ్ల క్రితం నన్నారి సాగు చేశాను. మంచి ధర పలికినప్పుడు వేర్లు తీయించి విక్రయించాలని నిర్ణయించుకున్నాను. ఇటీవల ఓ రైతు సాగు చేసిన నన్నారి పంటను పరిశీలించాను. అతనికి మంచి దిగుబడి వచ్చింది.

- రామిరెడ్డి, బంగారువాండ్లపల్లె

ప్రభుత్వాసుపత్రిలో పడకేసిన పారిశుధ్యం



వాడి పడేసిన మందులూ ఆసుపత్రి ఆవరణలోనే ఇలా... బాత్‌రూముల్లో అట్టముక్కలు వేసిన దృశ్యం

సిద్దవటం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవరం-1 పీహెచ్‌సీ ప్రభుత్వ ఆసుపత్రిలో పారిశుధ్యం పడకేసింది. ఆసుపత్రికి వచ్చే రోగులకు వ్యర్థాలతో కొత్త రోగాలు అంటుకుంటున్నాయని ఆందోళన చెందుతున్నారు. ఆసుపత్రి ఆవరణం మొత్తం వ్యర్థాలతో దుర్వాసనలు వెదజల్లడంతో పాటు దోమలు స్వైరవిహారం చేస్తుండడంతో రోగుల సహాయకులు సైతం అనారోగ్యం బారిన పడుతున్నామని ఆందోళన చెందుతున్నారు. ఆసుపత్రి ఆవరణంలో ఎక్కడపడితే అక్కడ కాలం చెల్లిన మందులు, సూదులను పడేశారు. డెలివరీ రూం, బాత్‌రూముల్లో అట్టపెట్టెలను పడేశారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు. ఈ విషయమై మాధవరం వైద్యాధికారి శివకుమార్‌ను వివరణ కోరగా ప్రాథమిక ఆరోగ్య పరిధి ప్రాంగణంలో ఉన్న అపరిశుభ్రతను పూర్తిగా తొలగించి డెలివరీ రూము, బాత్‌రూముల్లో ఉన్న అట్టముక్కలను తొలగిస్తామన్నారు. వైద్యశాలకు వచ్చిన రోగులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చేస్తామని వైద్యాధికారి తెలిపారు.

నాటుసారా స్వాధీనం.. ఒకరి అరెస్టు


పట్టుబడిన సారా నిందితుడితో ఎక్సైజ్ సిబ్బంది

రైల్వేకోడూరు రూరల్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపురం క్రాస్ వద్ద అక్రమంగా తరలిస్తున్న ఐదు లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేసినట్లు రైల్వేకోడూరు ఎక్సైజ్ సీఐ టి.కె.తులసి తెలిపారు. రాబడిన సమాచారం మేరకు గురువారం తనిఖీలు నిర్వహిస్తుండగా వీపీఆర్ కండ్రిగ పంచాయతీ ఎస్టీ కాలనీకి చెందిన చెంచురామయ్య వద్ద నాటుసారా స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. అక్రమంగా నాటుసారా తయారు చేసినా, విక్రయించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నాటుసారా ఎవరైనా తయారు చేస్తున్నా, తరలిస్తున్నా సమచారం ఇవ్వాలని కోరారు. ఈ దాడుల్లో సిబ్బంది చంద్రశేఖర్, శ్రీనివాసులు, మధుసూదన్ రాజు, సోమేశ్వర, రమణారెడ్డి, శివప్రసాద్ పాల్గొన్నారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలి

- ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం నేతల డిమాండ్


సమావేశంలో మాట్లాడుతున్న నరసింహులు

రాయచోటిటౌన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం నేతలు డిమాండ్ చేశారు. గురువారం రాయచోటి పట్టణంలోని కొత్తపేటలో గల ఆ సంఘ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అపస్ జిల్లా అధ్యక్షుడు నరసింహులు, గౌరవాధ్యక్షులు పరశురాంలు మాట్లాడుతూ ఇటీవల బదిలీలు పొంది గత ఎనిమిది సంవత్సరాలుగా లాంగ్ స్టాండింగ్‌లో ఉండి వివిధ రకాలుగా బదిలీలు పొందిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేసి వారి కొత్త స్థానాల్లో చేరే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం అపస్ జిల్లా సహాధ్యక్షుడు నాగేంద్రబాబు, రాష్ట్ర కార్యదర్శి మధుమతిలు మాట్లాడుతూ బదిలీలు పొందిన ఉపాధ్యాయులకు జీత బత్యాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో అపస్ నాయకులు సదాశివుడు, రెడ్డెయ్య, అపర్ణ, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎం కార్డు చోరీ చేసి రూ.25 వేలు డ్రా

నందలూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఏటీఎంలో మాయమాటలు చెప్పి ఏటీఎం కార్డు చోరీ చేసి రూ.25 వేలు విత్‌డ్రా చేసిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. బాధితుడు విశ్రాంత ఉపాధ్యాయుడు సానిపాటి నరసింహులు వివరాల మేరకు.. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఏటీఎంలో డబ్బులు విత్‌డ్రా చేసుకునేందుకు వెళ్లగా గుర్తు తెలియని వ్యక్తి మాయమాటలు చెప్పి తన ఏటీఎం కార్డును చోరీ చేసి రూ.25 వేలను డ్రా చేసుకున్నారు. ఈ విషయంపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.


నగదు పోగొట్టుకున్న బాధితుడు

సమస్యలకు తక్షణ పరిష్కారం : మంత్రి


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి

చిన్నమండెం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): సమస్యలను తక్షణ పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. చిన్నమండెం మండలంలోని తన స్వగ్రామం బోరెడ్డిగారిపల్లెలో ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్ కార్యక్రమానికి వందలాది మంది ప్రజలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యలను మంత్రికి వినిపించారు. ప్రతిఒక్కరి సమస్యను శ్రద్ధగా విన్న మంత్రి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజల ఆశయాలను సమర్థవంతంగా నెరవేర్చే దిశగా పనిచేస్తానన్నారు.

రైల్వేకోడూరు విద్యార్థి ప్రతిభ


పిడుగు కార్తీక్

రైల్వేకోడూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి జీప్యాట్ (గ్రాడ్యుయేట్ ఫార్మసీ ఆప్టిట్యూడ్ టెస్ట్) పరీక్షకు రైల్వేకోడూరు నరరాంపేటకు చెందిన విద్యార్థి పిడుగు కార్తీక్ అర్హత సాధించాడు. ఈ సందర్భంగా గురువారం విద్యార్థి మాట్లాడుతూ కడపలో బి.ఫార్మసీ పూర్తి చేశానని, తన లక్ష్యాన్ని సాధించేందుకు నిరంతరాయంగా కృషి చేసి జాతీయ స్థాయిలో నిర్వహించే జీప్యాట్ పరీక్షకు అర్హత సాధించానని తెలిపారు. కాగా విద్యార్థి విజయం పట్ల కుటుంబ సభ్యులు, బంధువులు సంతోషం వ్యక్తం చేశారు.

జాక్‌పాట్‌ను పూర్తిగా రద్దు చేస్తాం

- మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రమౌళి

గుర్రంకొండ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ వ్యవసాయ మార్కెట్ యార్డులో జాక్‌పాట్ విధానాన్ని పూర్తి స్థాయిలో రద్దు చేయిస్తామని మార్కెట్ కమిటీ చైర్మన్ కోసూరి చంద్రమౌళి పేర్కొన్నారు. గుర్రంకొండ మార్కెట్ యార్డులో గురువారం ఆయన వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ టమోటా రైతులకు భారంగా ఉన్న జాక్‌పాట్ విధానాన్ని పూర్తిగా రద్దు చేస్తామన్నారు. వ్యాపారులు మార్కెట్ యార్డులో జాక్‌పాట్ నిర్వహించకుండా తగు సూచనలు చేసినట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా మార్కెట్ యార్డులో నెల రోజుల వ్యవధిలో 15 కిలోల క్రేట్‌లను ప్రవేశపెట్టి జాక్‌పాట్‌ను లేకుండా చూస్తామన్నారు. అలాగే వ్యాపారులు అధిక కమీషన్లు వసూలు చేయకుండా తగ్గిస్తామని తెలిపారు. మార్కెట్ కమిటీ తీసుకున్న నిర్ణయాలను వ్యాపారులు పాటించాలని, లేనియెడల వ్యాపారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం మార్కెట్ యార్డులో చేయాల్సిన అభివృద్ధి పనులను పరిశీలించారు. రైతులకు అవసరమైన అన్ని వసతులను కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ నౌషాద్‌అలీ, సభ్యులు బయ్యారెడ్డి, బాబాజాన్, నాయకులు నౌషాద్‌అహ్మద్, ఎల్లుట్ల మురళీ, సుదర్శన్, ఆనంద్, మహాత్మారెడ్డి, చంద్రబాబు, సుంకర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


గుర్రంకొండ మార్కెట్‌యార్డులో వ్యాపారులతో మాట్లాడుతున్న చైర్మన్ చంద్రమౌళి

ఈ ఏడాదైనా నష్టాలు తీరేనా...?

- ధరల పతనంతో నేరేడు రైతుకు కోలుకోలేని దెబ్బ
- కిలో రూ.30 నుంచి రూ.50

కురబలకోట, జూన్ 26(ఆంధ్రజ్యోతి): వరుస నష్టాలను చవిచూస్తున్న నేరేడు రైతులు, వ్యాపారులకు ఈ ఏడాది కూడా నష్టాలను చవిచూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ప్రతి ఏడాది లాభాలను ఆర్జించవచ్చనే గంపెడాశతో వ్యాపారం చేసున్నారు. అయితే గత రెండేళ్లుగా విపరీతమైన పంట దిగుబడి రావడం, కరోనా తదితర కారణాలతో ధరలు తగ్గుముఖం పట్టడంతో పాటుగా ధరలు పతనమయ్యాయి. కాగా పంటపై చేసిన అప్పులు, వడ్డీలు ఎలా తీర్చాలో తెలియక లోలోపల కుమిలి పోతున్నారు. ఆరుగాలం కష్టపడి సాగు చేసిన టమోటా పంటకు కనీసం గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతన్నలు వరుస నష్టాలను చవిచూస్తున్నారు. ప్రతి ఏడాది పడమటి ప్రాంత మండలాల్లో రైతన్నలు నేరేడు పంటను సాగు చేసి లాభాలను ఆర్జించవచ్చనే గంపెడాశతో ఎదురు చూస్తున్న రైతన్నలకు ఈ ఏడాది నిరాశే ఎదురైంది. నేరేడు ధరలు ప్రస్తుతం ధరలు పతనమవడంతో రైతన్నలకు కన్నీరు పెట్టిస్తుంది. దీంతో తీవ్ర నష్టాలను చవిచూడాల్సిన పరిస్థితులు ఎదురవడంతో పంటపై చేసిన అప్పులు, వడ్డీలు ఎలా తీర్చాలో దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు.

జిల్లాలోని పడమటి ప్రాంత మండలాల్లో రైతన్నలు వ్యవసాయంపై ఆధారపడి వేలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నారు. ప్రధానంగా ఎక్కువ మంది రైతన్నలు టమోటా, మామిడి, అల్లనేరేడు తదితర పంటలను సాగు చేస్తారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అల్లనేరేడు పంట ధరలు ఒక్కసారిగా పతనమవడంతో రైతన్నలను కన్నీరు పెట్టిస్తుంది. కోరోనా దెబ్బ నుంచి కోలుకోలేని రైతన్నలకు ధరల పతనంతో మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. ఈ ఏడాది దాదాపుగా అన్ని పంటల ధరలు నిరాశాజనకంగానే ఉన్నాయి. అయితే అల్లనేరేడును సాగు చేసి లాభాలను ఆర్జించవచ్చనే కొండంత ఆశతో సాగు చేసిన రైతన్నలకు ధరలు పాతాళానికి పడిపోవడంతో వారి ఆశలను అడియాసలు చేసింది. ఈ ఏడాది దారుణంగా అల్లనేరేడు ధరలు పతనమవడంలో ఏం చేయాలో దిక్కుతోచని అయోమయ స్థితిలో రైతన్నలు పడ్డారు. కాగా ప్రతి ఏడాది అల్లనేరేడు పంట మే మాసంలో ప్రారంభమై జులై మాసం వరకు పంట దిగుబడి చేతికి వస్తుంది. ఈ పంట సీజన్ దాదాపుగా మూడు నెలలుగా వస్తుంది. కాగా ఎరువులు, క్రిమి సంహారక మందులు, కూలీలు తదితర వాటికి సంబంధించి భారీగా ఖర్చు వస్తుంది. పంట చేతికి వచ్చిన తర్వాత మార్కెట్‌లో అమ్మకానికి సిద్ధంగా ఉంచుతారు. ఇదివరలో పంట దిగుబడి తక్కువ రావడం, విపరీతమైన డిమాండ్ ఉండటంతో కిలో రూ.200 నుంచి రూ.400 వరకు పలికింది. కాగా ఇక్కడ అల్లనేరేడును కొనుగోలు చేసిన వ్యాపారులు హైదరాబాద్, విజయవాడ, మహారాష్ట్ర, తమిళనాడు తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు. ప్రస్తుతం మార్కెటింగ్ దిగుబడి అధికంగా రావడంతో డిమాండ్ అమ్మకాలు తగ్గుముఖం పట్టడంతో కొనే నాధుడు కరువయ్యారు. ప్రస్తుతం కిలో ధర రూ.30-40 మధ్య పలుకుతోంది. ఊహించని రీతిలో ఒక్కరిసారిగా ధరలు పతనం కావడం అంతుబట్టడం లేదు. కాగా ధరల పతనానికి ఇతర ప్రాంతాల్లో పంట దిగుబడి అధికంగా రావడంతో పాటు, ఎగుమతులు లేకపోవడం తదితర కారణాలతో ధరలు పతనమయ్యాయని వ్యాపారులు చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో రైతన్నలు నష్టాలను చవిచూడాల్సి వస్తోంది. ప్రభుత్వం చర్యలు తీసుకుని అల్లనేరేడు రైతులకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.


రైతుల నుంచి నేరేడు కాయలను కొనుగోలు చేసే కేంద్రం వద్ద వ్యాపారులు


అమ్మకానికి సిద్ధంగా ఉన్న అల్లనేరేడు

ఉద్యాన పంటలకు ప్రోత్సాహం

- నిరుపేద రైతులకు అండగా గ్రామీణ ఉపాధిహామీ పథకం
- పండ్ల తోటల సాగుకు నెలాఖరు వరకు అవకాశం

ఉపాధి పథకం ద్వారా అక్కులగారిపల్లెలో సాగుచేసిన కొబ్బరిచెట్లు



లింగాల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పండ్లతోటలు సాగుచేయాలంటే ఇపుడున్న పరిస్థితులలో సామాన్య రైతులకు శక్తికి మించిన పని. సంప్రదాయ పంటలు సాగు చేసుకుంటూ నష్టపోతున్న రైతులు ఎంతో మంది ఉన్నారు. ఉద్యాన పంటలు సాగుచేయాలంటే సహకరించని ఆర్థికపరిస్థితి. ఇటువంటి పరిస్థితులలో నలిగిపోతున్న నిరుపేద రైతుల కోసం చేయూతనందిస్తూ ప్రభుత్వం మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీథకం ద్వారా 15 రకాల పండ్లతోటల సాగుకు అవకాశం కల్పిస్తోంది. మామిడి, చీనీ, పులుసు నిమ్మ, జామ, సపోట, నేరేడు, సీతాఫలం, రేగు, కొబ్బరిచెట్లు, దానిమ్మ, అంజీర, అవకడ, చింత, డ్రాగన్ ఫ్రూట్ వంటి పండ్ల తోటలసాగుకు అయ్యే ఖర్చులు మొత్తం భరించడంతో పాటు మూడేళ్ల సంరక్షణ నిధులు ప్రతి నెల రైతు ఖాతాలో జమ చేస్తారు. అలాగే పూల తోటల సాగులో భాగంగా మల్లెపూల మొక్కల రకాలు, రోజాపూల మొక్కల రకాలు, మునగ తోట సాగుకు అయ్యే ఖర్చులు భరిస్తూ రెండు సంవత్సరాలు సంరక్షణ నిధులు ప్రతినెల మంజూరు చేస్తారు. అలాగే పొలంగట్లపై టేకు, ఎర్రచదనం, నేరేడు, సీతాఫలం, కొబ్బరిచెట్లు, మలబారు, వేప, వెదురు మొక్కలు మంజూరు చేస్తూ వాటిని సంరక్షించేందుకు రెండు సంవత్సరాలు ప్రతినెల రైతులకు డబ్బులు చెల్లిస్తారు. నిరుపేద రైతులకు ఇది చక్కని అవకాశమని.. ఈనెలాఖరులోగా దరఖాస్తు చేసుకోవచ్చని ఉపాధి హామీ పథకం ఏపీవో గంగరాజు తెలిపారు.



పెద్దకుడాలలో సాగుచేసిన చీనీచెట్లు

భారీ స్కోరు దిశగా కడప జట్టు

- 18 పరుగుల వెనకంజలో అనంతపురం



ప్రణీల్‌రెడ్డి (కడప), గురు విఘ్నేష్ (కడప), వీరారెడ్డి (అనంతపురం)

కడప స్పోర్ట్స్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్ 19 మెన్స్ మల్టీడే (మూడురోజులు) క్రికెట్ మ్యాచ్‌లలో గురువారం కడప జట్టు కర్నూలు జట్టుపై 93 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 401 పరుగులతో పటిష్ఠ స్థితిలో ఉంది. మరో మ్యాచ్‌లో అనంతపురం జట్టు నెల్లూరు జట్టు కన్నా 18 పరుగుల వెనుకంజలో ఉంది. వివరాలిలా... ఏసీఏ క్రికెట్ మైదానంలో కడప-కర్నూలు జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్‌లో టాస్ నెగ్గిన కడప జట్టు బ్యాటింగ్‌కు దిగి మొదటిరోజు ఆట ముగిసే సమయానికి 93 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 401 పరుగుల భారీ స్కోరు దిశగా సాగుతోంది. ఇందులో ప్రణీల్‌రెడ్డి 201 పరుగులు, గురు విఘ్నేష్ 139 పరుగులు చేశారు. అలాగే కేవోఆర్ఎం మైదానంలో నెల్లూరు-అనంతపురం జట్ల మధ్య జరుగు తున్న మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన నెల్లూరు జట్టు బ్యాటింగ్ చేపట్టి 50.4 ఓవర్లలో 212 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో మన్విత్‌రెడ్డి 48 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు మొదటిరోజు ఆట ముగిసే సమయానికి 34 ఓవర్లలో కేవలం ఒక వికెట్ మాత్రమే కోల్పోయి 194 పరుగులు సాధించి పటిష్ఠ స్థితికి చేరుకుంది. ఇందులో వీరారెడ్డి 103 పరుగులు చేయడం విశేషం.

ప్రజాస్వామ్యాన్ని భ్రష్టుపట్టించిన చరిత్ర కాంగ్రెస్‌దే

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి

కడప మారుతీనగర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ భ్రష్టు పట్టించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదేనని బీజేపీ జిల్లా అధ్యక్షుడు జంగిటి వెంకటసుబ్బారెడ్డి మండిపడ్డారు. గురువారం స్థానిక ఎన్జీవో కాలనీలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1975లో నాటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీకి సరిగ్గా 50 సంవత్సరాలు పూర్తి చేసుకుందన్నారు. అప్ప ట్లో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా దేశ వ్యాప్తంగా ఎమర్జెన్సీ విధిం చి ప్రతిపక్ష నాయకులను జైలులో బంధించడం దారుణమన్నారు. ఇవాళ అదే కాంగ్రెస్ నేతగా సేవలందిస్తున్న రాహుల్‌గాంధీ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మారుస్తుందంటూ ప్రచారం చేయడం విడ్డూ రంగా ఉందన్నారు. ప్రజాస్వామ్యాన్ని రక్షిస్తూ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని అమలు పరుస్తున్న దేశ ప్రధాని నరేంద్రమోదీ గొప్ప రాజకీయ నీతి జ్ఞుడు అని కొనియాడారు. గత 11 సంవత్సరాలుగా దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మనదేశాన్ని ప్రపంచంలోనే అభివృద్ధి చెందిన దేశాల సరసన సగర్వంగా తలెత్తుకునేలా మనదేశాన్ని తీర్చిదిద్దుతున్నారన్న సంగతి గుర్తు పెట్టుకోవాలన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు డాక్టర్ శివనాయక్, లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

2 నుంచి మహా గురుకులంలో తరగతులు

కడప, కలెక్టరేట్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు అధునాతన వసతులు, నాణ్యమైన విద్యనందించే లక్ష్యంతో బి.మఠంలో నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర మహా గురుకులంలో జూలై 2వ తేదీ నుంచి తరగతులు ప్రారంభం కానున్నట్లు కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాల్‌లో బిమఠం మండలంలో నూతనంగా ఏర్పాటైన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మహా గురుకులం (బాలుర) విద్యాలయంలో తరగతుల ప్రారంభానికి సంసిద్ధత, ఏర్పాట్లు, విద్యార్థుల అడ్మిషన్ సంబంధిత అంశాలపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బి.మఠం సమీపంలో అత్యాధునిక మౌలిక సదుపాయాలు, వసతులతో సువిశాల ప్రాంగణంలో రూపు దిద్దుకున్న మహా గురుకులం వచ్చే నెల 2వ తేదీ నుంచి పేదలకు నాణ్యమైన విద్యను అందించనున్నామన్నారు. 960 మంది విద్యార్థులకు విద్యా వసతులు కల్పించగల సామర్థ్యం ఉన్న బాలుర మహా గురుకులంలో ఈ విద్యా సంవత్సరంలో 800 మంది విద్యార్థులతో అడ్మిషన్లను పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే సగిలేరు, బి.మఠం గురుకుల పాఠశాలల పాత భవనాల్లోని 660 మది విద్యార్థులను కూడా మహా గురుకులంలోకి షిఫ్ట్ చేయడం జరుగుతోందన్నారు. కొత్త అడ్మిషన్లకు సంబంధించి కౌన్సెలింగ్ ప్రక్రియ కూడా కొనసాగుతోందన్నారు. తరగతులు ప్రారంభం నాటికి మహా గురుకులంలో ఎలాంటి మౌలిక సదుపాయాల కొరత లేకుండా చూడాలన్నారు. మహా గురుకులంలో అర్హులైన విద్యార్థులు చేరేందుకు ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో బద్వేల్ ఆర్డీవో చంద్రమోహన్, సాంఘీక సంక్షేమ గురుకులాల విద్యాలయాల జిల్లా కో-ఆర్డినేటర్ ఉదయశ్రీ, డీఈవో షంషుద్దీన్ , ఎస్ఎస్ఏ అధికారి నిత్యానందరాజులు, సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతి, కాంట్రాక్ట్ ఏజెన్సీ, పీఆర్ ఏపీఎస్పీడీసీఎల్ సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

ఉరివేసుకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాశినాయన జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వరికుంట్ల సమీపంలో జ్యోతి రోడ్డులోని అటవీ ప్రాంతంలో గుట్టపై గుర్తు తెలియని వ్యక్తి చెట్టుకు ఉరివేసుకొని మృతి చెందినట్లు ఎస్ఐ యోగేంద్ర తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు...

వరికుంట్ల గ్రామా నికి చెందిన ఉపాధి కూలీలు గురువారం పనికి వెళ్లారు ఉపాధిపని అనంతరం కొంతమంది పశుల మేతకోసం గుట్ట ఎక్కారు. అక్కడ దుర్వాసన రావడంతో పరిశీలించగా దాదాపు 40 సంవత్సరాల వ్యక్తి చెట్టుకు ఉరివేసుకొని చనిపోయాడు. విషయం స్థానిక వీఆర్ఏ, వీఆర్వోకు తెలిపారు. వారు తమ దృష్టికి తేవడంతో వెళ్లి పరిశీలించగా శవం కుళ్లిన స్థితిలో ఉంది. దాదాపు 20 రోజుల క్రితం ఉరివేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు కేసు నమోదు చేసి అక్కడే శవపరీక్ష చేసి పూడ్చించామన్నారు.

వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డులో మైదుకూరు మెప్మా



వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డును మెప్మా అధికారిణికి అందజేస్తున్న ఎమ్మెల్యే పుట్టా

మైదుకూరు రూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాలు చేసిన ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో అధిక సంఖ్యలో కొనుగోలు చేయడం వలన రాష్ట్రంలో పలు పట్టణాలతో పాటు, మైదుకూరు మెప్మాకు వరల్డ్ బుక్‌ఆఫ్ రికార్డుల్లో చోటు దక్కింది. ఈ మేరకు మైదుకూరుకు వచ్చిన షీల్డ్‌లను ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ చేతుల మీదుగా మెప్మా అధికారిణి కెజియా అందుకున్నారు. కార్యక్రమంలో అధికారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఫుడ్ టెక్నాలజిస్టుల పాత్ర కీలకం

- ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ

పులివెందుల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో ఫుడ్ టెక్నాలజిస్టుల పాత్ర కీలకంగా ఉందని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సెలర్ డాక్టర్ ఆర్.శారదా జయలక్ష్మిదేవి పేర్కొన్నారు. గురువారం పులివెందుల వద్దనున్న ఆహార విజ్ఞాన శాస్త్ర, సాంకేతిక కళాశాల వద్ద కాలేజ్ అండ్ హాస్టల్‌డే సందర్భంగా వీసీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా లైవ్లీహుడ్ బిజినెస్ ఇంక్యుబేషన్‌సెంటర్, టూ-వీలర్ పార్కింగ్ షెడ్‌లను ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా వీసీ మాట్లాడుతూ పులివెందుల వద్దనున్న కళాశాలలో చక్కని వనరులు ఉన్నాయన్నారు. ఈ వనరులను ఉపయోగించుకొని విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలని ఆమె ఆకాంక్షించారు. టెక్నాలజీ విద్యార్థులకు ఉన్న ఉద్యోగ అవకాశాలను ఆమె వివరించారు. ఈ కళాశాలలో కోర్సు పూర్తవుతూనే వారు ఉద్యోగం కోసమే ఎదురుచూడాల్సిన అవసరం లేదన్నారు. సొంతంగా బిజినెస్ గాని, మార్కెటింగ్ గాని చేసుకునేలా కళాశాలలో విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామన్నారు. నూతన ఆహార పదార్థాలను కళాశాలలో తయారు చేయించి వారిచే మార్కెటింగ్ ఎలా చేయాలి, ఎక్కడెక్కడ చేయాలనే అంశం కూడా ప్రాక్టికల్‌గా చేసి చూపుతున్నామన్నారు. అనంతరం వివిధ క్రీడలు, సాంస్కృతిక పోటీలలో విజయం సాధించిన విద్యార్థులకు ఉపకుల పతి చేతుల మీదుగా బహుమతులు, సర్టిఫికెట్లను అందించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ టెక్నాలజీ డీన్ డాక్టర్ ఎ.మణి, భారత ప్రభుత్వ వ్యవ సాయ, ప్రాసెస్డ్ ఫుడ్ ప్రొడక్ట్ ఎగుమతి అభివృద్ధి అథారిటీకి సంబం ధించిన తెలంగాణ ప్రాంతీయ విభాగాధిపతి ఆర్‌పీ నాయుడు, స్పైస్ బోర్డు అధికారి జి.శివకుమార్, పులివెందుల కళాశాల అసోసి యేట్ డీన్ డాక్టర్ ఎమ్.మాధవ, తదితర అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీసీ డాక్టర్ శారదా జయలక్ష్మిదేవి

ప్రభుత్వ లాంఛనాలతో బీఎస్ఎఫ్ జవాన్ అంత్యక్రియలు



శివప్రకాష్‌రెడ్డి (ఫైల్), మృతదేహం వద్ద విలపిస్తున్న భార్య బిడ్డలు

పులివెందుల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): తొండూరు గ్రామానికి చెందిన బీఎస్ఎఫ్ జవాన్ డి.శివప్రకాష్‌రెడ్డి (42) అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించారు. శివప్రకాష్‌రెడ్డి బీఎస్ఎఫ్ జవాన్‌గా పనిచేస్తున్నారు. సెలవుపై పది రోజుల క్రితం ఇంటికి వచ్చారు. బుధ వారం పులివెందులకు వెళుతుండగా గుండెపోటు రావడంతో మృతి చెందారు. ఈ విషయాన్ని బీఎస్ఎఫ్ అధికారులకు తెలపడంతో వారు వచ్చి మృతదేహంపై జాతీయ జెండా ఉంచి గౌరవ వందనం గావించారు. అనంతరం తొండూరులో గురువారం సాయంత్రం దహనసంస్కారాలు చేపట్టారు. కాగా, శివప్రకాష్‌రెడ్డికి భార్య నాగేశ్వరి, ఇద్దరు కుమార్తెలు అక్షిత, జ్యోత్స్న, కుమారుడు రుత్విక్‌రెడ్డిలు ఉన్నారు.

ఫర్నీచర్ షాపులో అగ్ని ప్రమాదం

- రూ.30లక్షలకు పైగా ఆస్తినష్టం

బద్వేలుటౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని నెల్లూరు రోడ్ జాతీయ రహదారిలో గురువారం రాత్రి శ్రీలక్ష్మీసాయి ఫర్నీచర్ షాపులో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో రూ.30 లక్షల మేరకు ఆస్తినష్టం వాటిల్లినట్లు యజమాని క్రిష్ణ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. నెల్లూరు జిల్లా అనంతసాగరం గ్రామానికి చెందిన చెప్పలి క్రిష్ణ ఒకటిన్నర సంవత్సరం కిందట బద్వేలు ప్రాంతానికి వచ్చి భగత్‌సింగ్ కాలనీలో నివాసం ఉంటూ నెల్లూరురోడ్డులో శ్రీలక్ష్మీ సాయి ఫర్నీచర్ షాపు పెట్టుకున్నాడు. ప్రతి రోజు మాదిరే గురువారం రాత్రి 8.30 గంటలకు షాపును మూసివేసి ఇంటికి వెళ్లాడు. దుకాణం మూసివేసిన 30 నిమిషాల తరువాత దుకాణం నుంచి భారీగా పొగలు బయటకు రావడంతో దుకాణం పక్కనే ఉన్న వారు ఫైర్‌సిబ్బందికి సమాచారం అందజేశారు. వెంటనే అగ్నిమాపక అధికారి సుధాకర్, సీఐ రాజగోపాల్‌లు అక్కడకు చేరుకొని సిబ్బందితో షట్టర్‌ను ఓపెన్‌చేసి మంటలను అదుపుచేశారు. అనంతరం ఫైర్ సిబ్బంది షాపు యజమానికి సమాచారం ఇవ్వడంతో దుకాణదారుడు క్రిష్ణ అక్కడకు చేరుకున్నారు. అప్పుచేసి దుకాణం ప్రారంభించానని, ఈ అగ్నిప్రమాదంలో సుమారు రూ.30 లక్షల మేరకు ఫర్నీచర్ సామగ్రి అగ్నికి ఆహుతి అయిందంటూ లబోదిబోమంటున్నాడు. అగ్నిమాపక అధికారులను వివరణ కోరగా.. ఆస్తినష్టాన్ని అంచనా వేస్తున్నామని, రెండు రోజుల్లో పూర్తి వివరాలను తెలియ జేస్తామన్నారు.



అగ్నిప్రమాదానికి ఆహుతి అయిన ఫర్నీచర్

వైసీపీ నేత అక్రమ నిర్మాణం కూల్చేందుకు యత్నం

- అడ్డుకున్న వైసీపీ శ్రేణులు
- బయనపల్లెలో ఉద్రిక్తం

బద్వేలు రూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బయనపల్లె చెరువులో వైసీపీ నేత నాగిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి నిర్మించిన అక్రమ కట్టడాన్ని కూల్చివేసేందుకు అధికారులు యత్నించారు. బయనపల్లె గ్రామానికి చెందిన వైసీపీ వాలంటరీ విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి చెరువులో అక్రమంగా ఇంటి నిర్మాణం చేపట్టాడు. దాదాపు ఐదేళ్లుగా అదే ఇంటిలో నివాసం ఉంటున్నారు. ఇటీవల అధికారులు చెరువులు, ప్రభుత్వ భూముల్లో అక్రమ కట్టడాల కూల్చివేత కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా గురువారం ఇరిగేషన్ డీఈ వేణుగోపాల్‌రెడ్డి, రూరల్ ఎస్ఐ శ్రీకాంత్, అట్లూరు ఎస్ఐ రామక్రిష్ణ, బి.కోడూరు ఎస్ఐ సురేశ్‌లతో పాటు తహసీల్దారు ఉదయభాస్కర్‌రాజు, పోలీసు, రెవెన్యూ సిబ్బందితో కలిసి గ్రామానికి చేరుకుని వైసీపీ నేత ఇంటి నిర్మాణం తొలగించేందుకు ప్రయత్నాలు చేపట్టారు. సాయంత్రం 4 నుంచి రాత్రి 9 వరకు అక్రమ కట్టడాన్ని కూల్చివేసేందుకు ప్రయత్నించారు. ఎక్స్‌కవేటర్, ఫైరింజను కూడా తెచ్చి సిద్ధంగా ఉంచారు. ఈ విషయం తెలిసిన శ్రీకాంత్‌రెడ్డి అనుచరులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు తీవ్రంగా ప్రతిఘటించారు. మున్సిపల్ చైర్మన్ వాకమల్ల రాజగోపాల్ రెడ్డి, జడ్పీటీసీ వంకెల చిన్న పోలిరెడ్డి తదితర నాయకులతో సహా అందరూ బయనపల్లెకు చేరుకుని అధికారులతో మాట్లాడారు. తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కూల్చివేయడం ఏమిటని వారు ఇరిగేషన్ డీఈని ప్రశ్నించారు. కూల్చేందుకు వీలు లేదంటూ వైసీపీ నాయకులు కార్యకర్తలతో పాటు నాగిరెడ్డి కుటుంబ సభ్యులు, మహిళలు అడ్డుకున్నారు. దీంతో మీరు చెరువులో కట్టడం నిర్మిస్తున్నారన్న విషయం తెలియదా అని శ్రీకాంత్‌రెడ్డిని డీఈ ప్రశ్నించారు. దీంతో వారి మధ్య వాగ్వాదం జరిగి... గ్రామం లో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. రాత్రి వరకూ పోలీసులు, రెవె న్యూ సిబ్బంది, ఇరిగేషన్ డీఈ అక్రమ కట్టడాన్ని పోలీసు సిబ్బంది సహకారంతో కూల్చివేసేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు.



శ్రీకాంత్‌రెడ్డి ఇంటి వద్ద గుమికూడిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు



అధికారులతో వాగ్వాదం చేస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి

గండిక్షేత్రంలో వేలం వాయిదా

చక్రాయపేట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంలో పూలు విక్రయం, టోల్‌గేట్ వసూలుకు నిర్వహించిన వేలం వాయిదా వేసినట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. గురువారం స్థానిక గండి క్షేత్రంలోని ఆలయ ఆవరణలో పూలు విక్రయం, టోల్ గేట్ వసూలుకు బహిరంగ వేలం నిర్వహించారు. పూల విక్రయానికి సంబం ధంచి ఆరుగురు, టోల్ గేట్ వసూలుకు ఐదుగురు మాత్రమే పాల్గొన్నారన్నారు. బహిరంగ వేలంలో పాటదా రులు ఎవరూ పాటపాడేందుకు ముందుకు రానందున నిలిపి వేశామన్నారు.

అలాగే దేవస్థాన షాపింగ్ కాంప్లెక్స్‌లోని 44 షాపులకు సంబంధించి హిందువులకు మాత్రమే పాల్గొనే అవకాశం కల్పించాలని బీజేపీ, విశ్వహిందూ పరిషత్ వారు లేఖల ద్వారా తెలియజేసినందున బహిరంగ వేలం తాత్కాలికంగా నిలుపుదల చేశామన్నారు. ఈ బహిరంగ వేలంలో జిల్లా దేవదాయశాఖ అధికారి మల్లికార్జునప్రసాద్, దేవస్థాన చైర్మన్ కృష్ణతేజ, మాజీచైర్మన్ వెంకటస్వామి, దేవస్థానం ప్రధాన అర్చకులు కేసరి, ఉప ప్రధాన అర్చకులు రాజారమేష్, ఆలయ, బ్యాంకు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నిర్మూలనే ధ్యేయం

మాదక ద్రవ్యాలను నిర్మూలిద్దాం ● యువతే టార్గెట్‌గా వ్యాపారాలు ● కుటుంబ వ్యవస్థ నిర్వీర్యంతోనే నేర ప్రవృత్తి

ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ ● ప్రజల చేత ప్రతిజ్ఞ చేయించిన అధికారులు, ప్రజాప్రతినిధులు



కలకడలో ర్యాలీ...





మాదక ద్రవ్యాల నిర్మూలనపై ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, సబ్‌కలెక్టర్ - ములకలచెరువులో ప్రతిజ్ఞ చేస్తున్న టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి

మదనపల్లె టౌన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): సమాజంలో డ్రగ్స్ నిర్మూలనే ధ్యేయంగా యువత పనిచేయాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ అన్నారు. స్థానిక జేసీఎం కమ్యూనిటీహాల్లో సబ్‌కలెక్టర్, డీఎస్పీ మహేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మదనపల్లె ప్రశాంతతకు మారుపేరుగా వుందని, ఇలాంటి చోట గంజాయి, డ్రగ్స్ తదితర నిషేధిత వస్తువుల వినియోగం, విక్రయాలపై ఉక్కుపాదం మోపాల్సిన అవసరం వుందన్నారు. తోటి స్నేహితులు డ్రగ్స్ వైపు అడుగులు వేయకుండా వారిని హెచ్చరించి మంచి నడవడికతో వుండేలా విద్యార్థులు కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ డ్రగ్స్ జీవితాలను నాశం చేస్తాయన్నారు. విద్యార్థులు దేశ భవిష్యత్తుకు ఎంతో అవసరమన్నారు. కుటుంబ వ్యవస్థ నిర్వీర్యంతోనే నేర ప్రవృత్తి పెరుగుతోందని, డ్రగ్స్‌తో జీవితాలు నాశనం అవుతాయని, కుటుంబీకులు మానసిక అశాంతికి గురవుతారన్నారు. డీఎస్పీ మాట్లాడుతూ యువతనే టార్గెట్‌గా చేసుకుని డ్రగ్స్ మాఫియా వ్యాపారాలు చేస్తున్నారని, డ్రగ్స్‌కు బానిసలైన యువత నేరాలకు అలవాటు పడుతున్నారన్నారు. అనంతరం ఎవరూ డ్రగ్స్‌కు జోలికి వెళ్లమని ప్రతిజ్ఞ చేయించారు. మొదట బీసెంట్ సర్కిల్ నుంచి జేసీఎం కమ్యూనిటీ హాల్ వరకు మాదకద్రవ్యాల నిర్మూలనపై పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీవైఈఓ లోకేశ్వరరెడ్డి, ఎక్సైజ్ సీఐ భీమలింగ, ఎంపీడీఓ తాజ్‌మస్రూర్, తహసీల్దార్ కిశోర్‌కుమార్, పోర్డు సంస్థ డైరెక్టర్ లలితమ్మ, టీడీపీ నేతలు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో... డ్రగ్స్ లేని సమాజం కోసం ప్రతి ఒక్కరం కృషి చేద్దామని పెద్దతిప్పసముద్రం ఎస్‌ఐ హరిహరప్రసాద్ వెల్లడించారు. పెద్దతిప్పసముద్రం పోలీసుల అధ్వర్యంలో విద్యార్థులు, సచ్చంద సంస్థలు, భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారంగా ఏర్పడి డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఎంఈఓ నారాయణ తహసీల్దార్ శ్రీరాములు నాయక్, ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్, వెలుగు ఏపీఎం హరి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు, వెలుగు సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ములకలచెరువులో... మారకద్రవ్యాలకు దూరంగా ఉండి విలువైన ప్రాణాలను కాపాడుకోవాలని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి అన్నారు. మారకద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులు, అధికారులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండు సర్కిల్‌లో మానవహారంగా నిలబడ్డారు. అంతకు మునుపు సీఎల్‌ఆర్‌సీ భవనంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీడీఓ హరినారాయణ, తహసీల్దార్ ప్రదీప్, టీడీపీ నేతలు గుత్తికొండ త్యాగరాజు, యర్రగుడి సురేష్, కేవీ రమణ, ముత్తకూరు మౌళా, విజయ్‌కుమార్, రామకృష్ణమరాజు, మూగి రవిచంద్ర, జనార్ధన్‌రెడ్డి, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

పెద్దమండ్యంలో... ప్రతి ఒక్కరూ మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని పెద్దమండ్యం ఎంపీడీఓ శ్రీధర్ రావు, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు పిలుపు నిచ్చారు. తహసీల్దార్ తేజశ్వి, ఎంపీడీఓ శ్రీధర్‌రావు, డాక్టర్లు ఇమ్మానుయేల్, మహబూబ్‌బాష, ఎంఈఓలు మనోహర్, రామకృష్ణ, కలిచెర్ల కాలేజీ పీఓ ఎన్‌ఎస్‌ఎస్ పీఓ వెంకటనరయ్య, ప్రిన్సిపాల్ రామాంజులు నాయక్, అధికారులు, పోలీసులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నిమ్మనపల్లిలో... బీడీ, సిగరెట్, గంజాయి, మధ్యం, కొకైన్ వంటి మాదక ద్రవ్యాలకు ప్రజలు దూరంగా వుండాలని మండల అధికారులు ప్రతిజ్ఞ చేశారు. తహసీల్దార్ తపస్విని, ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీధర్, ప్రధానోపాధ్యాయులు అంజాద్, ఎస్‌ఐ తిప్పేస్వామి, పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కురబలకోటలో... మత్తుకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని తహసీల్దార్ ధనంజయులు, ఎంపీడీఓ గంగయ్య, రూరల్ సీఐ సత్యనారాయణ, పేర్కొన్నారు. విశ్వం, గోల్డెన్ వ్యాలీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులచే అంగళ్ళు బస్టాండ్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ భూదేవి, గోల్డెన్‌వ్యాలీ కరెస్పాండెంట్ ఎన్.వి రమణారెడ్డి, ఎంఈఓ ధ్వారకనాథ్, ఎస్‌ఐ దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో... మాదక ద్రవ్యాల రహిత సమాజ స్థాపనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని ఎక్సైజ్ సీఐ మాధవి పిలుపునిచ్చారు. జూనియర్ కళాశాల విద్యార్థులు, అంగన్‌వాడీలు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే అనర్థాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. హరిత కూడలిలో మానవహారం ఏర్పడి డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేద్దామని ప్రతిజ్ఞ చేశారు. ఎంఈఓ త్యాగరాజు, ఎంపీడీఓ థామస్‌రాజు, ఏఎస్‌ఐ నజీర్ బాష, పోలీసు సిబ్బంది, పోర్డు సిబ్బంది పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో... యువత మాదకద్రవ్యాలకు దూరంగా వుండాలని మునిసిపల్ కమిషనర్ జీవీ పల్లవి అన్నారు. వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులతో కలిసి పట్టణంలో ప్లకార్డులు చేతపట్టి ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ కృష్ణవేణి, సీడీపీఓ భాగ్యమ్మ, ఏఓ రమాదేవి అంగన్వాడీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో... డ్రగ్స్ మహమ్మారితో జీవితాలను దుర్భరం చేసుకోరాదని వాల్మీకిపురం సీఐ ప్రసాద్‌బాబు, తహసీల్దార్ పామిలేటి అన్నారు. స్థానిక పీవీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో వేలాదిమంది విద్యార్థులతో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ చంద్రమౌళి, ఎంపీడీఓ మనోహర్‌రాజు, ప్రిన్సిపాల్ ఉమాఅమరేశ్వరి, డిప్యూటీ ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహ్మద్‌రఫీ, ఎస్‌ఐ చంద్రశేఖర్, టీడీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, వివిధ శాఖల అధికారులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, నేతలు, అంగన్వాడీ, ఆశా వర్కర్లు, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీలేరులో... మాదకద్రవ్యాల వినియోగం మానవ మనుగడకు ప్రమాదకరమని వక్తలు అన్నారు. పంచాయతీ కార్యాలయ సమావేశ మందిరంలో సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ సమాజంలో నేరాలు పెరగడానికి మాదకద్రవ్యాల వినియోగానికి అవినాభావ సంబంధం ఉందన్నారు. తహసీల్దార్ శివకుమార్, అర్బన్ సీఐ యుగంధర్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ సుబ్బా రెడ్డి, ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ రాధామాధవి, ఎంపీడీఓ శివశంకర్ తదితరులు మాట్లాడారు. మార్కెట్ కమిటీ చైర్మెన్ పురం రామ్మూర్తి, మండల టీడీపీ అధ్యక్షుడు వారణాశి శ్రీకాంత్ రెడ్డి, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, సీడీపీఓ రాజమ్మ, ఎంఈఓ పద్మావతి, కళాశాలలు, విద్యార్థులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

గుర్రంకొండలో... విద్యార్థులు, యువకులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ రఘురాం, తహసీల్దార్ లక్ష్మీప్రసన్న అన్నారు. హైస్కూల్ నుంచి బస్టాండు వరకు ర్యాలీని నిర్వహించారు. అనంతరం బస్టాండులో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశులు, ఎంఈఓ సురేంద్రబాబు, ఏపీఎం రజనీకుమారి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కలకడలో... అందరం కలిసి డ్రగ్స్ రహిత సమాజానికి కృషి చేద్దామని ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపారు. కలకడలో పోలీసులు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. బస్టాండు కూడలిలో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహేశ్వరిబాయి, ఎంపీడీఓ అబ్దుల్‌రహీం, డాక్టర్లు మల్లికార్జున, మోహన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

కలికిరిలో... మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే యువత పెడదోవ పడుతుందని కలికిరి పోలీసు ఇన్‌స్పెక్టర్ కె.రెడ్డిశేఖర్ రెడ్డి హెచ్చరించారు. మాదక ద్రవ్యాల వినియోగంపై కేసులు నమోదైతే భవిష్యత్తులో ఉద్యోగాలు కూడా రావని ఆయన స్పష్టం చేశారు. పట్టణంలో పోలీసుల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఎంపీడీఓ భానుమూర్తి రావు, డిప్యూటీ తహసీల్దారు సయ్యద్ అహ్మద్, ఎంఈఓ కరీముల్లా, వైద్య శాఖ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



వాల్మీకిపురంలో అధికారులు, ఉపాధ్యాయులు, మహిళలు, నేతలు, విద్యార్థుల మానవహారం



బి.కొత్తకోటలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



పెద్దతిప్పసముద్రంలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ఉద్యోగులు, ప్రజలు



పెద్దమండ్యంలో మానవహారం



పీలేరులో...

వేడుకగా గుప్త నవరాత్రులు ప్రారంభం

యల్లమ్మతల్లి ఆలయంలో వారాహి అమ్మవారి విశిష్ట పర్వదినాలు



కలికిరి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసం పాడ్యమి మొదలు తొమ్మిది రోజులు వారాహి అమ్మవారి విశిష్ట పర్వదినాల సందర్భంగా గుప్త నవరాత్రులు వేడుకగా నిర్వహించనున్నారు. స్థానిక పురాతన గ్రామ దేవత యల్లమ్మ తల్లి ఆలయంలో వెలసిన వారాహి అమ్మవారి విగ్రహాన్ని ఆకర్షణీయంగా పుష్పాలంకరణ చేసి అభిషేకాలు నిర్వహించారు. గురువారం ఉత్సవాలను వైభవంగా ప్రారంభించగా పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. రోజూ ప్రత్యేక కార్యక్రమాలతో అమ్మవారి నవరాత్రులను విశిష్ట పర్వదినాలుగా నిర్వహించనున్నారు. 29వ తేదీ పంచమి రోజు సాయంకాలం వారాహి మాత పుష్ప పల్లకిలో పుర వీధుల్లో విహరించనున్నారు. ఈ సందర్భంగా వారాహి హోమం కూడా ఏర్పాటు చేస్తున్నారు. కలికిరిలో యల్లమ్మ తల్లి ఆలయంలో ఈ ఏడాది నవరాత్రి ఉత్సవాలను ఘనంగా చేస్తున్నారు.

జిల్లాలో ప్రభుత్వ రంగ పరిశ్రమలు నెలకొల్పాలి

ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ

మదనపల్లె అర్బన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ రంగ పరిశ్రమలు నెలకొల్పాలని జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబ శివ, జిల్లా అధ్యక్షుడు గంగాధర్ డిమాండ్ చేశారు. నిన్న విజయవాడలో నిర్వహించిన ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సమావేశంలో వారు మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా ఏర్పాటు చేసి నాలుగేళ్లు కావ స్తున్నా ఎటాంటి ప్రభుత్వ రంగ సంస్థలను ఏర్పాటు చేయలేదని విమర్శించారు. నూతన పరిశ్రమలను నెలకొల్పి కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, వలసలను నివారించాలని కోరారు. అన్నమయ్య ప్రాజెక్టును పునఃనిర్మాణం చేపట్టాన్నారు. హంద్రీనీవా, గాలేరు-నగరి నీటి ప్రాజెక్టులు త్వరగా పూర్తి చేయాలన్నారు. జిల్లా సమగ్రాభివృద్ధికి రూ. పది వేలకోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.

తెలుగు యువత అధ్యక్షుడిగా నల్లారి రియాజ్



నల్లారి రియాజ్



ఖాజా హుసేన్

పీలేరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మండల తెలుగు యువత అధ్యక్షుడిగా నల్లారి రియాజ్ నియమితులయ్యారు. పీలేరు పట్టణం కట్టుకాల్వ వీధికి చెందిన రియాజ్ రెండు పర్యాయాలు తెలుగు యువత అధ్యక్షుడిగా పనిచేశారు. ఇటీవల జరిగిన పార్టీ సంస్థాగత ఎన్నికల్లో ఆయనకు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి మరోమారు అవకాశం కల్పించారు. నియోజకవర్గ తెలుగు యువత ప్రధాన కార్యదర్శిగా షేక్ ఖాజా హుస్సేన్ నియమితులయ్యారు.

వైభవంగా బలిబండి



హరికథ చెబుతున్న మాలతి

కలకడ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మహల్ క్రాస్‌లో జరుగుతున్న మహాభారత యజ్ఞంలో భాగంగా గురువారం బలిబండిని వైభవంగా నిర్వహించారు. భీముడి వేషధారి కలకడ, కేవీ పల్లె మండలాల్లోని పలుగ్రామాలకు వెళ్లి ప్రజల నుంచి ఆహారంగా పండ్లు, ఫలహారాలను స్వీకరించారు. మధ్యాహ్నం ద్రౌపది స్వయంవరం హరికథను మాలతి బృందం వినిపించారు. భక్తులు అపురూప ఘట్టాలను తిలకించారు. నిర్వాహకుడు మదన్‌మోహన్‌రెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

బీరువా వితరణ



బీరువా వితరణ చేస్తున్న ఉపాధ్యాయుడు

మదనపల్లె అర్బన్, జూన్26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు మోడెం చెంగల్‌రాయుడు ఉద్యోగ విరమణ సందర్భంగా మదనపల్లె ఉపవిద్యాశాఖ అధికారి కార్యాలయానికి బీరువాను వితరణ చేశారు. బీరువా తాళాలను డిప్యూటీ డీఈఓ లోకేశ్వర్‌రెడ్డికి అందజేశారు. దాతను పలువురు అభినందించారు. ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు రెడ్డెప్పరెడ్డి, శ్రీనివాసులు, రాజేంద్రబాబు, హరినాథరెడ్డి, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పురం వెంకటరమణ, చంద్రశేఖర్, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

సాధికారతతో స్వపరిపాలన సాధ్యం



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ అమరనాథ్

ములకలచెరువు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): సాధికారితతో స్వపరిపాలన సాధ్యమని డీఎల్‌డీఓ అమరనాథ్ అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ములకలచెరువు, తంబళ్లపల్లె, పెద్దమండ్యం, పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట మండలాల మహిళా సర్పంచులకు గురువారం నుంచి మూడు రోజుల శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. సర్పంచులు తరచూ గ్రామాల్లో పర్యటించాలని, బాధ్యతాయుతంగా సేవలు అందించాలన్నారు. గ్రామ పాలన, నిధుల లభ్యత, వినియోగం, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హరినారాయణ, ఈఓఆర్డీలు మోహన్‌ప్రతాప్, బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

వృద్ధులకు రేషన్ సరుకులు పంపిణీ

గుర్రంకొండ, జూన్ 26(ఆంధ్రజ్యోతి): వృద్ధులు, వయస్సుపైబడిన వారికి గురువారం రెవెన్యూ సిబ్బంది రేషన్ సరుకులను అందజేశారు. గత నెల నుంచి రేషన్ సరుకులను డీలర్లు పంపిణీ చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం వయస్సుపైబడిన, దివ్యాంగులకు రేషన్ సరుకులను ఇంటి వద్దకే పంపిణీ చేయాలని సూచించడంతో మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో డీలర్లు రేషన్ సరుకులను అందజేశారు.

భూసమస్యలు పరిష్కరించాలి

- తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీఎస్పీ నిరసన

ములకలచెరువు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): బహుజనుల భూసమస్యలు తక్షణం పరిష్కరించాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు అబ్బవరం యుగంధర్, నియోజకవర్గ ఇన్‌చార్జి పెద్దపాళ్యం మల్లికార్జున కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట భూ సమస్యల పరిష్కారానికి బీఎస్పీ నేతలు నిరసన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల భూ సమస్యలు పరిష్కరించి అర్హులకు ఇంటిపట్టాలు మంజూరు చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ ప్రదీప్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సోమశేఖర్, జిల్లా కార్యదర్శి నరసింహులు, మండల కన్వీనర్ కోటి, నేతలు టీవీ రమణ, రవికుమార్, కృష్ణప్ప, భాను, అనీల్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి తోడ్పడాలి

నిమ్మనపల్లి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): తవళం అటవీ ప్రాంతంలో వెలసిన నేల మల్లేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తోడ్పాటునందించాలని ఈఓ మంజుల పేర్కొన్నారు. స్వామి వారి ఆయలంలోని హుండీ లెక్కించారు. మూడు నెలలకు భక్తుల నుంచి వచ్చిన ఆదాయం రూ.23,648లు వచ్చిందని వచ్చిన ఆదాయాన్ని వాల్మీకిపురం ఇండియన్ బ్యాంకులో జమ చేశామన్నారు. ఇప్పటికే ఆలయ నిర్మాణానికి రూ.3కోట్లు మంజూరు కాగా అందులో కోటి రూపాయలతో గర్భగుడిని నిర్మించాలని మిగిలిన రూ.2కోట్లు విడుదలైన వెంటనే గుడి పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ శశికుమార్, నిర్వాహకులు రామకృష్ణ, సర్పంచ్ రెడ్డెప్ప. చిన్నరెడ్డెప్పరెడ్డి, సోమశేఖర్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

కష్టపడిన వారికి ప్రాధాన్యం



కదిరినాధునికోటలో జరుగుతున్న గ్రామకమిటీ ఎన్నికలు

ములకలచెరువు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు గ్రామ కమిటీ ఎన్నికల్లో అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు టీడీపీ సంస్థాగత ఎన్నికల మండల పరిశీలకుడు మేకల రెడ్డిశేఖర్ అన్నారు. నాయనిచెరువుపల్లె, కదరినాధునికోట, సెంట్రల్ స్కూల్ టీడీపీ గ్రామ కమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మెన్ కేవీ రమణ, నేతలు భజంత్రీ రామాంజులు, ముత్తకూరు మౌలా, విజయ్‌కుమార్, రామకృష్ణమరాజు, మూగి రవిచంద్ర, జనార్ధన్‌రెడ్డి, ఫాస్టర్ శ్రీనివాసులు, నాగిరెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందులు వేయించాలి



గొర్రెలకు నట్టలనివారణ మందు వేస్తున్న డీడీ నీరజ, డాక్టర్ సురేష్

నిమ్మనపల్లి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొర్రెలు మేకలకు నట్టలనివారణ మందులు వేయించాలని పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకులు నీరజ పేర్కొన్నారు. గురవారం పలు గ్రామాల్లో పర్యటించిన ఆమె మాట్లాడుతూ గొర్రెలు, మేకలు అనారోగ్యం పాలుకాకుండా ప్రభుత్వం నట్టలనివారణ మందును ఉచితంగా పంపిణీ చేస్తోందన్నారు. మందును తాపితే జీవాల్లో వుండే పురుగులు చనిపోయి ఆరోగ్యంగా వుంటాయని తెలిపారు. కార్యక్రమం 26 నుంచి జూలై 10వరకు జరుగుతుందని తెలిపారు. అనంతరం రాచవేటివారిపల్లిలో రైతు సేవాకేంద్రంలో రికార్డులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

మదనపల్లె టౌన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మదనపల్లె ఆర్టీసీ టు డిపో పరిధిలో నెలకొన్న సమస్యలు, ప్రయాణికుల సూచనలు, సలహాలు, ఫిర్యాదులపై డయల్ యువర్ డీఎం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ ట్రాఫిక్ సీఐ గీత పేర్కొన్నారు. శనివారం ఉదయం 11గంటలకు ప్రయాణికులు డిపో మేనేజర్‌కు ఫోన్ చేయవచ్చన్నారు. డిపో పరిధిలో బస్సు సర్వీసులతో సమస్యలు, ఆర్టీసీ ఆదాయం పెంచుకునే మార్గాలపై సూచనలు ఇవ్వాలని కోరారు. 9959225677కు ఫోన్ చేయాలని ఆమె ఒక ప్రకటనలో కోరారు.

గోళ్లపల్లి విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

బి.కొత్తకోట, జూన్26(ఆంధ్రజ్యోతి): గోళ్లపల్లి జడ్పీహైస్కూల్ టెన్త్ ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు మానవత సంస్థ ప్రతినిధులు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో హేమలతకు రూ.3000, సంజనకు రూ.2000, గీతాంజలికి రూ.1500 అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం శాంతకుమారి, సర్పంచ్ అమరనాథరెడ్డి, మానవతసంస్థ యన్.క్రిష్ణారెడ్డి, దాత రామచంద్రారెడ్డి, మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

'రాయల్ క్రాఫ్ట్' ప్రారంభం

మదనపల్లె అర్బన్, జూన్26(ఆంధ్రజ్యోతి): స్థానిక మిషన్ కాంపౌండ్‌లో రాయల్‌క్రాఫ్ట్ బజారును ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాయల్ క్రాఫ్ట్ బజారు మేనేజరు ధన్‌రాజ్ చేనేత వృత్తులను ప్రోత్సహిస్తూ ఏటా మదనపల్లెలో రాయల్ క్రాఫ్ట్ బజారును నిర్వహిస్తున్నారన్నారు. అతివలు మెచ్చే వస్త్రాలు, పిల్లలు మెచ్చే డ్రస్సులు, యువతకు ఉపయోగపడే గాజులు, వివిధ రకాల జ్యువెలరీస్, అన్ని రకాలు షర్ట్సు, డ్రస్సులు, అగరబత్తీలు, కొండపల్లె బొమ్మలు సరసమైన ధరలకు అందుబాటులో ఉంచారన్నారు రాయల్ క్రాఫ్ట్ మేనేజరు మాట్లాడుతూ రోజు ఉదయం 9 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఉంటుందన్నారు. సెలవు రోజులు, ఆదివారం కూడా తెరిచి ఉంటుందని తెలిపారు.

ప్రిన్సిపాల్ నియామకం



అధ్యాపకులతో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్ గుప్తా

పీలేరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): గ్యారంపల్లె ఏపీ గురుకుల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ జయం శ్రీనివాస్ గుప్త నియమితులయ్యారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చెన్నకేశవులు వెంకటగిరి జూనియర్ కళాశాలకు బదిలీ అయ్యారు. దీంతో అదే కళాశాలలో సీనియర్ అధ్యాపకుడిగా పనిచేస్తున్న శ్రీనివాస్ గుప్తా ఏపీ రెసిడెన్షియల్ సొసైటీ కార్యదర్శి ఆదేశాల మేరకు ఎఫ్‌ఏసీ ప్రిన్సిపాల్‌గా గురువారం బాధ్యతలు చేపట్టారు.